
పూర్తి పేరు : పెన్నా వేంకట శివరామకృష్ణ శర్మ. జన్మస్థలం : దుగునవల్లి గ్రామం, నల్లగొండ జిల్లా. జననం : 08-02-1960. చదువు : సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి M.A. (1980-82), M.Phil., (1983), Ph.D. (1988). వృత్తి : జూనియర్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడు. ప్రస్తుతం : ఆం.ప్ర. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, తొగుట, మెదక్ జిల్లా. వచన కవిత్వంతోపాటు హైకూలు, గజళ్ళు రాశాడు. నాలుగు సాహిత్య విమర్శ గ్రంథాలు ప్రచురింపబడినాయి. "శివారెడ్డి కవిత్వం-పరిణామ వికాసాలు" గ్రంథానికి "నూతలపాటి గంగాధరం సాహితీ సత్కారం" (2002) లభించింది.



పెన్నా శివరామ కృష్ణ

కవిత్వం

దీప ఖడ్గం

పాలపిట్ట బుక్స్

DEEPA KHADGAM (Collection of Telugu Poems)

By
Penna Siva Rama Krishna
Flat No. 203, Road. 9,
Venkateswara Colony,
Saroornagar, Hyderabad-35
Ph.No. 94404 37200

First Edition	:	November 2008
For Copies	:	Palapitta Books 16-11-20/6/1/1, 403, Vijayasai Residency Saleemnagar, Malakpet, Hyderabad-500 036
Composed at	:	Fontline Graphics Baghlingampally, Hyd-44 Ph.No. 040-27660000
Printed at	:	Vipla Computer Services Nallakunta, Hyderabad-44 Ph. 040-27676910
Price	:	**Rs. 30/-**

ప్రియమిత్రులు,
గుడిపాటి గారికి...

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థికంగా సహకరించిన ఆప్తమిత్రులు, ఆంగ్లోపన్యాసకులు,
సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-అధ్యక్షులు
శ్రీ కూర రవీందర్ రెడ్డి గారికి
హార్దిక కృతజ్ఞతలు.

శిథిల ముకురం స్వీయగాథ

స్వీయ అశ్రువులలో తడిసిన అసంపూర్ణ ప్రేమ లేఖను నేను
గాయాల పెదవుల మీద నర్తిస్తున్న
మౌన విషాద బృందగానాన్ని,
శిథిలమైన అఖండ కావ్యం నుంచి
రాలిపడిన బీభత్స పదచిత్రాన్ని నేను

మెహిదీహసన్ కంఠంలోని
నిత్య సంగ్రామాలస దుఃఖాశ్రు స్నిగ్ధ సాంధ్యవిషాదగద్గద
గాంధర్వ స్వర సౌరభాన్ని నేను

సహస్రాధిక సంవత్సరాల క్రితం
నా పూర్వీకులు పన్నిన పద్మవ్యూహంలో
చిక్కుకున్న అభినవ అభిమన్యుడిని నేను
శతాబ్దులుగా "పరధర్మా"న్ని శాసిస్తూ
"స్వధర్మా"న్ని అవసరానికి తాకట్టుపెట్టిన
అవకాశవాదానికి వారసుడిని నేను

సహస్ర వైరుధ్యాల కూడలిలో దిక్కుతోచని
ఒంటరి బాటసారిని నేను

అధర్మ సమర శాస్త్ర విమర్శకుడిని నేను
పంచవర్ణ అశ్రుశాస్త్రవేత్తను నేను
వెలుగును కబళించి తిరిగి సూర్యుడిని ప్రసవిస్తూ
చంద్రుడిని తారలను లోకానికి పరిచయం చేసి
అనామకంగా చెరిగిపోతున్న రజనీగంధాన్ని నేను

మొండిగోడల మీద గర్జిస్తున్న చిరుగాలి సితార సంగీతాన్ని నేను
స్వీయపాదధూళి నిర్మించిన చెరసాలలో
బంధింపబడిన అనంత యాత్రికుడిని నేను

దేనికీ, ఎవరికీ ఛాయాచిత్రంగా మారలేని విచ్ఛిన్న ముకురాన్ని నేను
ఎవరికీ ఏ వాగ్దానమూ చెయ్యలేని
చేజార్చుకున్న పాదరస వాక్య తోరణాన్ని నేను

స్వీయశిథిల సమాధి మీద వాలుతున్న శుష్క సుమహారాన్ని నేను
విదళితాశ్రువులు కంఠంలో ఘనీభవించిన
బ్రాహ్మణాధముడిని నేను

అనివార్య విస్ఫోటనలో ముక్కలైన
అవయవాంతరంగాలను సేకరించి
పునర్నిర్మించుకోవాలనే వ్యర్థ కాంక్షల్లో దహిస్తున్న
ప్రాణావశిష్ట ఖండిత శిరస్సును నేను.

కాంతి ధారలు...

1. సమాంతర ప్రవాహాలు 9
2. ఖునూతే నాజిలా 12
3. రోడ్డు దాటాలి 14
4. అశ్రు కౌముది 16
5. దీపఖడ్గం 18
6. కత్తి అంచుతోనే... 21
7. ఒకరు, ఇంకొకరు, మరొకరు 24
8. వధ్యశిలమీద... 26
9. భ్రమపడనివ్వండి! 29
10. వైరస్ 31
11. వినిర్మాణానికీ... 34
12. దేహశృంఖల 36
13. గాయం నా సహచరి 38
14. ప్రవాహ సూత్రం 40
15. సుదూర సామీప్యాలు 42
16. ఒక బాటసారి స్వగతం 45
17. అనివార్యం 47
18. రెండు మిణుగురులు 49
19. ముక్కలైన పద్యం 50

20. శూన్యవృత్తాలు 53
21. ఇంకొంచెం............ 54
22. చిత్రకవి............ 57
23. ఆ సమయాన... 59
24. దేహానికి ప్రేమలేఖ............ 61
25. బాధించని గాయం 63
26. అప్రమేయంగానే............ 65
27. లోకమూ-నా ప్రియురాలు 67
28. స్వప్నశకలాలే నాకు ఆనవాలు............ 69
29. గాలం చివర... 71
30. రెండు తలలు 72
31. తెలిసి తెలిసీ............ 73
32. అనిర్వచనీయం 75
33. అతడు 76
34. యాత్ర............ 77
35. ఒకానొక రాత్రి............ 79
36. జలదీపం 81
37. మాట్లాడే కపాలం............ 82
38. ప్రశ్నల ప్రవాహంలో 84
39. పాక్షికం............ 86
40. నిశ్శేషం............ 88
41. ప్రవాసం నుంచి ప్రవాసానికి 90
42. దారితప్పాలి............ 92
43. తోలుబొమ్మ 94
44. బధిరుల సంభాషణ 95
45. ఒకానొక కప్ప 97
46. ముగింపు ఒక దీపస్తంభం 98

సమాంతర ప్రవాహాలు

"We read the world wrong and say that it deceives us".

ఎందుకైనా మంచిది,
ఈ పద్యానికి ముగింపు ముందే చెప్పేస్తాను.
సామాన్యులు జీవితం నుంచి పాఠాలు నేర్చుకుంటారు;
మేధావులు గుణపాఠాలు నేర్చుకుంటారు

ఏ కొమ్మా తాను మోయలేనంత బరువైన పూవును పూయదు.
ఆధునిక వసుదేవుడు
ట్రాఫిక్ యమున దారి ఇస్తుందని వేచి ఉండడు;
నదికి తానే దారి ఇస్తూ స్వప్నశిశువును ఆవలితీరం చేరుస్తాడు.
రాయి విసిరితే దోసిట్లో రాలే పండు కాదు సూర్యుడు.
శిలువలైన కలలన్నీ ద్రోహమూర్తులే.

నీడలో నిల్చుని ఒకడు వెలుగును వెక్కిరిస్తుంటాడు.
మరొకడు నీడల కొలతలు తీస్తూ వెలుగుకు వెలకడుతుంటాడు.
వెలుగులోనే వ్యవసాయం చేసే వాడికి
నీడలు గడియారపు ముళ్ళు

ఒకడికి అశ్రుబిందువు,
ఎటునుండి చూడాలో తెలియని నైరూప్య చిత్రపటం.
మరొకడు అశ్రువులో ఒకవైపునున్న సముద్రాన్నీ
మరోవైపునున్న సప్తవర్ణ రంగవల్లిని ఒకేసారి చూస్తుంటాడు.
గాయం, బతుకు ప్రియురాలు తీర్చిన గోరింట.
వాంఛా పుష్పంలో వేదనా మకరందం.
ఏకాంతంలో కన్నీటి బృందగానాన్ని వినలేనివాడు
ఎత్తిన పిడికిళ్ళ ప్రవాహంలో రాలుతున్న
ఒంటరి కన్నీటి బొట్టులోని
రోదసిని చూడలేడు.
నింగి ఎడారిలో సూర్యుడు కూడా
నగ్నపాదాల బాటసారి.

క్షతగాత్ర వేణువు,
ఆర్తనాదమే స్వరప్రస్తారం.
'కన్నీరొక చుక్కున్నచో
ఏకష్టమైనా భరియింతును' అనే గోరటి వెంకన్నకు
కోరస్‌గా మారతారు,
కనులున్నంత కాలం కన్నీరుంటుందనుకునేవారు.

వారు క్షణంలో నడిచే నిలువెత్తు కన్నీటి చారికైపోతారు.
మరుక్షణం కన్నీటి కొలిమిలో పదునెక్కి
కాంతిధారల ఖడ్గాలై అవతరిస్తారు.
స్వేదబిందువులను తుడుచుకొన్నంత అప్రయత్నంగా
కపోలాల మీది రెండు జీవనదులను తుడిచేసుకుంటారు.
ఇక ఉపోద్ఘాతాన్ని ఆపి పద్యాన్ని ప్రారంభిస్తాను.

మేధావులకు తమకలల చుట్టూ అల్లుకున్న సాలెగూడు ఒక కాంతి పరివేషం.
ఇతరులు తొలిపొద్దు లేలేత కిరణాల దువ్వెనలతో
కనులమీదికి జారుతున్న
కలల ముంగురులను సవరించుకొని
నిత్యనూతన సంగ్రామానికి సన్నద్ధమవుతారు.

"ఆంధ్రజ్యోతి" 'వివిధ' 9-1-2006

ఖునూతే నాజిలా

"కొందరు తమ వాగ్దానాలను, దేవుని విషయంలో చేసిన ప్రమాణాలను అతిస్వల్ప మూల్యానికి అమ్ముకుంటారు. ప్రళయదినాన దేవుడు వారివైపు కన్నెత్తి కూడ చూడడు". -ఖుర్ ఆన్

వజూ నీళ్ళ అడుగునుంచి
రెక్కలు విప్పుతున్న నెత్తురు పడగలు.
దువా కోసం ఎత్తిన చేతులలో
సోదరుడి దేహ శకలం.

'సుబ్‌హానల్లాహ్' అనే సమయమూ లేదు.
'రుకూ' చేస్తున్న వీపుమీద విద్రోహరాబందు
స్వీయరక్తచ్ఛాయలో మానవతా కపోత మృతదేహం
'సజ్దా'లో నుదుట్తితోనే కాదు-
ఏడు అవయవాలతో
పుడమిని ఎక్కడ చుంబించాలన్నా భయమే!
ఎక్కడ ఏ మందు పాతరలున్నాయో?
ఎక్కడ ఏ రిమోటు మీటలున్నాయో?
'దువా - ఏ-ఖైర్' తప్ప

ఏ దుశ్చింతనా లేని ప్రార్థన ఇది.
అసహనపు విషదంష్ట్రలూ తెలుసు,
అవిశ్వాసపు అదృశ్య కరవాలాల కరచాలనమూ తెలుసు.
విశ్వాసం ఆచ్ఛాదనలో వంచనా విస్ఫోటనం,
అత్యాధునిక సమర వ్యూహం.

అకారణ ద్వేషం ఒక క్షుద్బాధిత సర్పం,
ఒక తార రాలినంత మాత్రాన
వెన్నెల మసిబారదు.

విహ్వల విచ్ఛిన్న వీక్షణాల్లాకాదు,
మానవ భుజశాఖాగ్రాలనుంచో
వికసిత పుష్పాంజలులనుంచి పరిమళాల్లానో
పావురాలు స్వేచ్ఛగా ఎగరాలి.

'బిస్మిల్లా హుర్రహమానుర్రహీమ్'
దయాళువు కృపాళువు అయిన
అల్లా నామస్మరణతో ఆరంభిస్తున్న
మన నమాజ్‌లు అర్థాంతరంగా ఆగరాదు,
రక్తసిక్త ఖడ్గాల దువాలు కొనసాగరాదు.

(ఏదైనా విపత్తు సంభవించినప్పుడు నమాజ్‌లో అదనంగా చదివే వాక్యాలను 'ఖునూతే నాజిలా' అంటారు.)

ఆంధ్రజ్యోతి - "వివిధ" - 28-5-2007

రోడ్డు దాటాలి

ఈ క్షణానికి ఇదే జీవిత లక్ష్యం,
ఈ క్షణానికి ఇదే జీవన పరమార్థం.
రోడ్డు దాటాలి

అప్రమత్తంగా దాటాలి.
మనః సరోవరాన్ని నిశ్చల చిత్రంగా మార్చి,
దేహాంతరంగాలకు అద్వైతాన్ని కల్పించి,
ఈ కాయాన్ని ఆవలి తీరం చేర్చాలి.

ఈ రోడ్డు దాటితే రౌరవాది నరకాలను దాటినట్టు.
ఈ రోడ్డును రెండు క్షణాలలో
అడ్డంగా ఈదగలిగితే తక్షణ జీవన్ముక్తి.

ఈ రోడ్డును దాటాలి.
ఇరుతీరాలను నెమరువేస్తున్న
ఉద్ధృత ప్రవాహాన్ని దాటాలి.
పరస్పర వ్యతిరేక దిశలలో పరుగెత్తే
రెండు భారీ సరీ సృపాలను దాటాలి.

అడుగుతీసి అడుగువేసేలోపు
త్రికాలాలను దర్శించాలి.

ఎదురుగానే కాదు,
కుడి ఎడమలా కనుచూపు మేర
స్థలకాలాలను,
రకరకాల వాహనాల వేగవైవిధ్యాన్ని
రెప్పపాటులో బేరీజు వేయాలి, వ్యూహరచన చేయాలి.
భారంగా కదిలే నా అడుగులతో
అలల వేగాన్ని పోల్చుకోవాలి.

అస్తమయంలోపు
ఇంటికి చేరేలోగా
ఎన్నెన్నో రోడ్లను దాటాలి.
ఒన్‌వే ట్రాఫిక్ రహదారినీ
రెండు వైపులా పరికించాలి.
ఈ రహదారి ఒక వైతరణి.
ఏ సహయాత్రికుడినో, ఏ వాహనాన్నో
కవచంగా నిలుపుకొని అయినా రోడ్డుదాటాలి.

కాలుమోపే చోటులేని
దృశ్యాదృశ్య విభజన రేఖ,
నడివయసులాంటి
డివైడర్‌ను చేరుకోవడమంటే
అన్ని విషదంష్ట్రలను,
అలల ఆటుపోట్లను అధిగమించి
బతుకును సగమీదినట్టే!

అప్పుడప్పుడూ
ఉపశమించని అలల రహదారినీ నేనే,
పాదచారినీ నేనే!

-'సూర్య' దినపత్రిక-'అక్షరం' 21-7-2008

అశ్రు కౌముది

కోనేటిలో కదులుతున్న దేవాలయ గోపురం.
రెప రెప లాడుతున్న కార్తీక దీపాల్లా
చిరు అలల మీద చలిస్తున్న హరిత నక్షత్ర కుసుమాలు –
ప్రేయసి అధరాంచలం నుండి
ఆగి ఆగి వెలువడుతున్న మాటల మధు బిందువుల్లా,
కొబ్బరాకుల కొనల నుండి
బొట్లు బొట్లుగా జారుతున్న వెన్నెల–
ఆమె చిరునవ్వులా నానార్థాల వెన్నెల–
అంతా ఒక వివర్ణ దృశ్య స్మృతి శకలం.

ఇప్పుడు సూర్యుడు, చంద్రుడు, వెన్నెల
కాలంచెల్లిన నాణాలు–
అరిగిపోయిన పదబంధాలు–
ఫజర్‌నుండి ఈషావరకు
రోజుకు ఐదుసార్లు,
ఫాల భాగంతో ప్రేమగా ముద్దాడితే
ముస్లిము సోదరుడికి నేలతల్లి కానుకగా ఇచ్చిన

నుదుటి మీది నల్లని మచ్చలా,
చుంబన ముద్రలా,
మేఘాల మేలి ముసుగులో చంద్రుడు.

నీలి తెరమీద ముద్రింపబడిన
ఎర్ర తారల ఆకాశ పతాకంనుండి
లేలేత కలల్లోకి జాలువారుతున్న డాలర్ వెన్నెల.

బీడు పడిన చేనులో
దిష్టిబొమ్మ శిరస్సులా
వ్యత్యస్త కుంభాకార చంద్రుడు.

అన్ని రుతుబంధాలను పారద్రోలి
గుండెలోని బాష్ప రుతువును చూడలేని మనిషికి
చౌరాస్తాలో ఎవరికీ పట్టని స్తంభంమీది
పురాతన గడియారం సూర్యుడు.
గగన కుడ్యానికి వేలాడుతున్న
శిథిల వింజామర చంద్రుడు.

ఇప్పుడు సూర్యచంద్రులు
పరస్పరం అనుసరించి కదిలే
కాంతివంతమైన రెండు గుండ్రని మబ్బు ముక్కలు.

ఇంతకూ చంద్రుడంటే
కరిగి పెరిగే, పెరిగి కరిగే
సమూహంలో అనామక ఒంటరి బాటసారేనా?
వెన్నెలంటే సూర్యుడి నీడేనా?

12-2-06

దీప ఖడ్గం

"హమ్‌తో యూం అప్‌నీ జిందగీ సే మిలే
అజ్‌నబీ జైసే అజ్‌నబీ సే మిలే"

ఒక చేతిలో పూల కొమ్మతో
మరో చేతిలో కరవాలంతో
నిత్య యౌవన ప్రేమ స్వప్నాలతో
అతడు బయలుదేరాడు.

దేహాంతరంగాన్నీ, అంతరంగదేహాన్నీ పెనవేసుకుంటున్న
నునులేత తీగలను విడదీసుకుంటూ,
నలుదిశలా తరుముతున్న సుడిగాలుల మధ్య
అతడొక సంచార దీపశిఖ.

కనుబొమల మీద పారాడుతున్న
గడ్డిపరకల్ని ఎగదోయడానికీ,
వెన్నెముక తంబురా శ్రుతిలో
మనసు మారుమూలల్లోని ఏ కూని రాగాన్ని వినడానికీ,
ఏ అరుణాశ్రువుల కనుపాపల్లోకి తేరిపారచూడడానికీ తీరికలేదు.

రాలుతున్న బెరడునూ,
అప్రయత్నంగానే వీడుతున్న కుబుసాలనూ
గమనించే సమయమూ లేదు.
క్షణక్షణం అతను చేజారిన ఆదర్శముకురం,
మరుక్షణం కలక దేరిన కాసారం.
భుజం మీద రాలుతున్న ఎండుటాకులే సాంత్వనహస్తాలు.

పరుగెత్తే రహదారి చక్రాన్ని చాపలా విప్పుకుంటూ,
దారిలోని రాళ్ళను ఏరి వడిసెలలో కూర్చుకుంటూ అతడు.
పరుగెత్తుతూనే లోనికి చూసుకుంటే
అణువణువునా ఊర్ధ్వముఖంగా ఎగిసిపడుతున్న అగ్నిధారలు.
శిరస్సు మీద శ్వేతపతాకం,
మెడలో జేగంట.
ఆకాశం అవధిలేని ఉమ్మడి ఆస్తి.
జయాపజయాల సరిహద్దులలో తనకు తాను
శాశ్వత అపరిచితుడు.

నిరవధిక గమనంలో దేనికీ తీరిక లేదు.
అంతర్ బహిర్ యుద్ధాల సాక్షిగా
ఇప్పుడతనికి ఏ కోరికా లేదు.
అతడిప్పుడు వీధి దీపాలలో
తప్పిపోయిన చంద్రబింబం.

ఆరక తప్పదు-ఆరుతూనే ఎగయక తప్పదు.
రాలక తప్పదు-రాలుతూనే రవళించక తప్పదు.
నడవక తప్పదు-నవ్వక తప్పదు

నేడు ఒక చేతిలో శుష్క పుష్పశాఖ,
మరో చేతిలో విరిగిన పిడిబాకు.
మూసినా, తెరిచినా కనులముందు స్వప్నాల అస్థిపంజరాలు.
స్థిరత్వాన్ని అభినయిస్తూ మునుముందుకు సాగడం,
నడకను నటిస్తూనే శిలామూర్తిగా మారడం,
ఏ రేఖలూ చెరగకుండా పొలిమేరల్లో సల్లాపమాడడం,
ఒక శాస్త్రీయకళ, ఒక కళాశాస్త్రం.
దూరం నుంచి చూస్తే
అతడు సహస్ర కిరణ చందన కాంతివృత్తం.
దగ్గరగా వెళితే
గాలికొరడాల వాయు వ్యూహంలో,
పగిలిన కలల గాజు ముక్కల దారిలో,
అన్నివైపులా ఒకేసారి
ప్రహారతాండవం చేస్తున్న దీపఖడ్గం

ఆంధ్రజ్యోతి- దినపత్రిక 'వివిధ' 14-4-2008

కత్తి అంచుతోనే ....

మెలకువగా ఉండడమంటే
ఎన్నింటినో నిద్రపుచ్చడమే.

నిద్రలోనూ మెలకువ.
నిద్రాముద్రితాల నేపథ్యంలో
మెలకువ.

అంతా నిద్రాజాగృతి,
జాగృతనిద్ర.
నిద్రా జాగృతుల పొలిమేర
అదృశ్య అగ్నిరేఖ.

మాటలు నేర్చుకుంటున్న కొద్దీ
నిషిద్ధాంశాలే విస్తరిస్తుంటే
గురితెలిసిన మౌనమే సరికొత్త
సంకేతభాష!

అంతరంగం శాశ్వత
సంశయ ధర్మక్షేత్రం.

దేహాన్ని పరివేష్టించిన
నిత్యకురుక్షేత్రం.

క్షణక్షణం ఆత్మహత్య,
అనుక్షణ పునరుత్థానం.
భస్మపరిమళాల మధ్య ఆశానిశ్వసనం.

దారులన్నీ అసిధారలు,
నీడలన్నీ అంపశయ్యలు.

ప్రశాంతత ప్రచ్ఛన్న సమరం,
సంగ్రామమే ఆరామ విరామం.

వ్యక్తావ్యక్తాలకూ,
మనిషికీ, సమూహానికీ
సంశయ నిశ్చితాలకూ
నిర్బంధాలకూ, విముక్తికీ
మనసుకూ మనుగడకూ మధ్య

గతానికీ వర్తమానానికీ
వర్తమానానికీ భవిష్యత్తుకూ

కారుణ్యానికీ శత్రుత్వానికీ
వినయానికీ అహంకారానికీ

నిరంతరం రెండు పరస్పర
భిన్నలోకాల నడుమ
స్వప్నం భయానక వాస్తవమూ,
వాస్తవం భీకర స్వప్నమూ

అయినవేళ

సమస్తద్వంద్వాల అధినేతగా,
సరిహద్దులలో సైనికుడిగా,
బాటసారిగా
నిరంతర బహుపాత్రాభినయం

శతానేక పాత్రల జాతరలో
నిన్ను నీవు కోల్పోకుండా
నిలుపుకునే
పర్యవేక్షకుడివీ నీవే

మిత్రుడా!
కత్తి అంచుతోనే కన్నీటిని
తుడుచుకో!
వెంటాడే విషకంటకాన్నే
వేణువుగా మలచుకో!

వార్త-'రచన'-20-1-2008

ఒకరు, ఇంకొకరు, మరొకరు

"Our wrongs have become the weapons of reality." – David Diop

నాణెం మీద రెండు కుతర్క సూత్రాలు వేలాడదీసి
బొమ్మ బీటలు వారిందంటారొకరు.
తన ఛాయాచిత్రాన్ని ఫ్రేములో బిగించి
అద్దమని నా ముందుంచుతారింకొకరు.
నదికి ఎప్పుడూ తీరం ఒకటే అంటారు మరొకరు.
వృత్తలేఖిని చేతికిచ్చి
లంబరేఖ గీయమంటారొకరు.
ఏ చిరు కారు మేఘం ఏ విగ్రహం తలమీద రెట్టవేస్తుందో,
ఏ మేఘ మాసం ఏ విగ్రహాన్ని అభిషేకిస్తుందో తెలియని
అయోమయంలో నేనుంటే...
ఒక విగ్రహాన్ని ధ్వంసం చెయ్యమని చెప్పి
మరో విగ్రహాన్ని ఆయుధంగా అందిస్తుంటారింకొకరు.
సాగరతీరంలో నడుస్తూ
తన పాదముద్రలే రహదారి అంటారు మరొకరు.

గాలిరెక్కల మీద కూర్చుని
నిశ్చలంగా విహరిస్తున్న ఎండుటాకుని చూపి
తన కేతనమంటారొకరు.

గాలి మరో మజిలీ చేరగానే
నేల ఒడిలో వాలుతున్న శుష్క పత్రాన్ని చూపి
వృక్షం సమూలంగా ఒరిగిపోతున్నదంటారింకొకరు

ఒకటి తర్వాత ఒకటిగా
ఆరుతూ వెలుగుతున్న విద్యుద్దీపతోరణాన్ని చూపి
కాంతి ప్రవాహమంటారు మరొకరు.

ఆదర్శాల కోసం జీవించాలంటారొకరు.
ఆదర్శాల కోసం మరణాన్నయినా
ఆలింగనం చేసుకోవాలంటారింకొకరు.
ఆదర్శాల సులోచనాలను,
నేత్ర పటలాలను పరీక్షిస్తూ మరొకరు.

అందరి పాదాల కింద రంగులు మారుతున్న నేలనూ,
గతి తప్పుతున్న రుతువులనూ
అధ్యయనం చేస్తూ నేను.

'సూర్య' దినపత్రిక – 'అక్షరం' – 4-2-2008

వధ్యశిల మీద....

చూపులను ఆశించే అన్నింటినీ
బాహు వృత్తంలో చేర్చుకోవాలి;
అల్లుకోవాలి,
ఆలింగనం చేసుకోవాలి,
నుదుటి మీద ముద్దుపెట్టి
హృదయానికి హత్తుకోవాలి.
కానీ పరిమళించే సంకెళ్ళనూ
పెనవేసుకునే సుందర విషవల్లికలనూ
తెంచుకోక తప్పదు.
అల్లుకున్నంత అలవోకగా విడివడక తప్పదు
హృదయాన్ని కూడా అరచేతిలో
చిన్న గ్లోబులా నిలిపి
అంతర్నాళాలన్నింటినీ శోధించక తప్పదు.
పరిచయాల కూడికల తర్వాత
వీడ్కోళ్ళ తీసివేతలు
ఎప్పుడూ మరణ సదృశాలే

ఇరువైపులా చేతులు చాచి
అనుబంధ బంధాల మధ్య,
సర్వేంద్రియాలను రెండు పాదాలుగా చేసి
శూన్యంలో కట్టబడిన
అసిధారా సూత్రం మీద నడవక తప్పదు.

కెరటాల్లా చేతులు పైకి చాచి ఉంచి
సముద్ర గర్భంలో విహరించాలి.
నేలను వేళ్ళ పాదాలతో బిగించి పట్టుకొని
బాహువుల పక్షాలతో రోదసిలో ఈదాలి.
కనుకొలుకుల కన్నీటి ప్రమిదల్లో

సూర్యచంద్రులను వెలిగించుకోవాలి.
గాయాల, గాయపు మరకల
విషాద మధుర గీతాలలో తేలిపోతూనే
కత్తీడాలూ అందుకుని కదనానికి కదలాలి.

గత, ఆగతాల మధ్య పెండ్యులంలా ఊగుతూ
అనుక్షణం
వర్తమాన వధ్యశిల మీద నిశ్చలంగా
శిరస్సు నిలపడమూ,
గడియారపు ముళ్ళలా
విడిపోతూ ఆశ్లేషించుకోవడమూ
ఆశ్లేషించుకుంటూనే విడదీసుకోవడమూ...
అంతా ఎటాచ్‌డ్ డిటాచ్‌మెంట్,

డిటాచ్‌డ్ ఎటాచ్‌మెంట్.
మనిషి రిరంసా బద్ధ ముముక్షువు;
విముక్తికై తపించే లాలసుడు.

ఇన్ని యుద్ధాలు చేసీ.....
ఇన్ని నరకాలు గడిచీ....
మృత్యుశయ్య మీద
గొంతు పెగలని చివరి స్వగతం
"అంతా నిరుపయోగం! నిరుపయోగం!
నిష్ప్రయోజనం! నిష్ప్రయోజనం!"

'సాక్షి' దినపత్రిక, 4-8-2008

భ్రమపడనివ్వండి!

నన్ను భ్రమపడనివ్వండి!
వర్తమాన విచ్ఛిన్న వధ్యశిలావేదిక మీద
సంభాషణలు మరచిన పాత్రల ఉన్మత్త ప్రేలాపన,
కాకపోతే మౌనసంభాషణ-
ప్రేక్షకులు, పాత్రధారులు రూపభేదం కోల్పోయిన
అసంబద్ధ నాటకం సుఖాంతమవుతుందని భ్రమ పడనివ్వండి!
హంతకుడి రూపాన్ని అంతరంగంలో చిత్రించుకుంటూ,
హంతకుడిని వేటాడుతూ తానూ హంతకుడైన దృశ్యాన్ని
అనివార్య అస్తిత్వసంక్షోభమని భ్రమ పడనివ్వండి!

జయాపజయాలు
పరస్పర ద్విపాత్రాభినయంతో చేస్తున్న ప్రహేళికా పరిహాసాలు!
ఒక ద్వారాన్ని తెరుస్తుంటే మూసుకొంటున్న శతాధిక ద్వారాలు.
గోడలను కూల్చబోయి
గోడలకు పహారాకాస్తున్న ఆయుధాలు.
అధివాస్తవిక చిత్రాల్లాంటి కవులు.

పరస్పర అపరిచిత భాషలో చేస్తున్న ఘోష,
వీరగాథా బృందగానమని భ్రమ పడనివ్వండి!

అక్షరాలు అసహన మూర్తులయ్యాయి.
ఇక ఏకాక్షర వాక్యాలే
నేపథ్య గీతాలని భ్రమ పడనివ్వండి!

ఉన్న ఒక్క నక్షత్రాన్ని మింగేయాలని
మబ్బులు పొంచి ఉన్నాయి.
ఇక వెన్నెలను గూర్చిన చింతే లేదు.
మబ్బులన్నీ చంద్రబింబాలై
అత్యాధునికంగా కురిసే వెన్నెల
నల్లగా ఉంటుందని భ్రమ పడనివ్వండి!

మెలకువ నుండి నిద్ర వరకు
శారీరక చలనాలే 'కాశీయాత్ర' అనీ,
భ్రమ నుండి భ్రమకు చేస్తున్న ప్రయాణమే
జీవన సంగ్రామమనీ
భ్రమ పడనివ్వండి!

'నెల నెలా వెన్నెల' (2002) కవితా సంకలనంలో ముద్రితం

వైరస్

కంప్యూటర్ సూర్యుడికి అర్ఘ్యమిచ్చి నమస్కరించాడు.
అతని దినచర్యను ఆదేశించింది.
చతురస్రాకారపు నీలి తెర ఇప్పుడతని ఆకాశం.
తల ఎలుకను మీటేవేలుగా మారింది.
ఎలుకను మీటటం ఏనుగునెక్కటానికేననీ
తేలిపోయింది.
కుశల ప్రశ్నలూలేవు-కులాసా కబుర్లూ లేవు
ఉభయకుశలోపరులసలేలేవు.
వస్తువ్యామోహంలో, వస్తువుల సహవాసంలో
వస్తువుల మధ్య మనిషి ఒక సజీవ వస్తువు,
వేళ్ళులేని మొక్క.

వ్యక్తిసామూహిక శక్తిగా మారటానికి
ఎన్నియుగాలు పట్టిందో!
ఒక్క రక్తపు బొట్టు కూడా రాలకుండానే
క్షణంలో సర్వం విధ్వంసం!

చెట్టుకు తెలియకుండానే తోట అమ్మబడుతోంది,
పిట్ట కంఠానికి కూడా తెలియకుండా పాట బాణీ మారుతోంది.
దేశం దేశమంతా రాబందుచేతిలో మాంసపుముద్ద.
గోధూళివేళల్ని చూడడానికి
గోమయాన్ని వాడుకోడానికి ఇకముందు
ఎవరి అనుమతైనా అవసరం కావచ్చు!
H_1 వీసా సామూహిక బహిరంగ స్వప్నసుందరి.
డాలర్ కలచెరగని తీర్థయాత్రికుల కోలాహలంలో
మాట తప్పిపోయింది-మనిషి తప్పిపోయాడు.
ఇప్పుడిక ఏదీ రహస్యం కాదు
రూపాయి అనాథగా మారుతున్న కొద్దీ వాడి కలల సౌధం
అంబరాన్నంటుతోంది.
ఇప్పుడిక దాపరికమేమీ లేదు.
తనకొకదేశమే లేని వాడికి-తనదేశం చెత్తబుట్టయిన వాడికి
దేశభక్తి బూతుమాటే-
ఇప్పుడిక సిగ్గుపడాల్సిందేమీ లేదు.
అంకెలు తప్ప అక్షరాలక్కరలేదు.
సమాచారం తప్ప జీవన సంగీతమక్కరలేదు.
గమ్యం తప్ప గడిచిన చరిత్ర అవసరం లేదు.
దేశం అనాథ శరణాలయమవుతుంటే చింతేలేదు!
ఖండాల మధ్య తరిగిన దూరం
మనసుల మధ్య ఘనీభవించింది.
అదృశ్య ఆత్మీయతాబంధాలకు వైరస్,
హృదయం పాస్‌వర్డ్ కోల్పోయిన ఫైలు.
విశ్వం కుగ్రామమైనందుకు

మనిషిగా క్షణం గర్వపడదాం!
విశ్వం విపణి వీధిగా మారినందుకు
మనసులోనే తనివితీరా విలపిద్దాం!
నీలితెర విండోలోంచి
వాడు దేశదేశాల కరెన్సీ గ్రాఫ్‌ను చూస్తున్నాడు.
కిటికీలోంచి చూస్తే నాకు
భూగర్భాన్ని చీల్చుకొస్తున్న శత్రుహస్తాల్లా
పునరుత్పత్తి లేని విత్తనాలు,
పంటంతా హరించినా ఆకలి తీరక
రైతు కళేబరాన్ని కబళిస్తున్న పురుగులు కనిపిస్తున్నాయి.
నదీతీరాన పిచ్చుకగూళ్ళలా
రహదారి పక్కన శిథిల గృహాలు,
ఆధునిక హరప్పా మొహంజొదారోలు కనిపిస్తున్నాయి.
వాడి ఒక కంట్లో 'లిబర్టీ స్టాచ్యూ',
మరో కంట్లో కాలిపోతున్న దేశపతాకం కనిపిస్తున్నాయి.
ఈ రాత్రి ఆకాశం నక్షత్రాలు పొదిగిన మరోదేశపు
నీలిజెండాలా....
భూగోళమంతా డేగ గిట్టలో కోడిపిల్ల,
దేశాలన్నీ డాలర్ తీరానికి లంగరేసిన పడవలు.
ఒక డేగ రెక్కల నీడ ప్రపంచానికి సూర్యోదయం.
మనిషి ఏకాకి ద్వీపంగా మారటమే వ్యక్తిత్వ వికాసం.
ప్రేమించే రోజులాగే మనిషిగా జీవించటానికీ
ఒకరోజుంటే బాగుంటుందేమో!

'మత్తడి' కవితా సంకలనంలో ప్రచురితం

వినిర్మాణానికీ...

చిరు దివ్వెను సహస్రహారాలతో అలంకరించి
వెలుగు కోసం వెతికితే ఎలా!
నీలోని నక్షత్ర మండలాన్ని ఆవిష్కరిస్తూ
నువ్వే కారు మేఘానివైపోతే ఎలా!

విరామ చిహ్నాలను గుర్తించిన పదం
తగిన స్థానంలో తనకు తానే ఒదిగిపోతుంది.
పూర్ణ విరామాన్ని ఊహించని వాక్యం
ముగిసేది శూన్యంలోనే!

అరాచక జీవన వాక్యంలో పద ఘటనలన్నీ
సంకేత స్థలాలు మరచిపోయిన గూఢచారులు.

ఉన్మాద కరవాలంతో
నీ శిరస్సును నీవే ఖండించుకొని
కపాల భిక్షాపాత్రతో
ఎవరినీ ఆయుస్సు అర్థించకు.
నియమాతిక్రమణలోనూ

ఒక నియతి ఉండాలి.
గతి తప్పడంలోనూ సుగతి ఉండాలి
విధ్వంసానికీ ఒక వ్యాకరణముండాలి
వినిర్మాణానికీ విశేష వ్యూహముండాలి

ఫల పుష్పాలేమైనా ఉంటే చూపించు!
సంజాయిషీల, పశ్చాత్తాపాల
పాద సూచికలెవడికి కావాలి?

గెలుపుకు ముందూ వెనుకా క్షణక్షణ ఆత్మ బలిదానం,
ఓటమి రేపటి అతిథి.

(ఒక కవి మిత్రునికి ప్రేమతో)

'వార్త' ఆదివారం అనుబంధం-22-7-2007.

దేహ శృంఖల

నిలువుగా చీలిన ముఖాన్ని ఇక అద్దంలో చూసుకోలేను
తప్పొప్పుల పట్టికే పాఠ్య గ్రంథం.
లోహకంటక ప్రాకారాల వెంట
అనాసక్తిని నటిస్తూ పచార్లు చేయలేను.
అన్నింటినీ ఒక్కసారే పట్టుకోబోయి
దేనిని మిగుల్చు కోని చేతులు మంచుముద్దలు.

పెదవులు కంపించి మూర్ఛనలు పోనిమాటలెందుకు?
సీతాకోక చిలుకలు వాలని ఉత్తరాలెందుకు?

అన్ని ముఖాలూ పొరలు రాల్చుకున్న
అజంతా కుడ్య చిత్రాలు-
పురా వైభవాలు-జననాంతర సౌహృదాలు.
ఏదీదాగదు-
అసందర్భంగానో, అసమయంలోనో బయటపడుతుంది.

సంధ్యాకాశపు చీకటి నీడ
మానససరోవరం మీద పరచుకున్న

అనివార్య దైనిక చలనాల గుర్రపుడెక్క.

స్మృతి ఒక మంత్రదండం-మరణశాసనం.
అనుక్షణ మరణాలు-పునరుత్థానాలు.
ఇరు తీరాలను పారవశ్యంతో చుంబిస్తున్న జీవనడోల-

హేమంత ఉషోదయాన
పువ్వు కంఠపార్శ్వాన జారుతున్న
ముత్యంలోని ఇంద్రధనుస్సు వివరాలెందుకు?
ఈ రాత్రి అలసిపోయిన గగన ఫాలాన్ని
మృదువుగా స్పృశించాల్సిన అమృత హస్తం ప్రవాసంలోనే-

"దుర్గాపురం రోడ్...దుర్గాపురం రోడ్"...
లోలోపలి పొరల్లో ఒక మేలు కొలుపు.
దేహం ఒక సంకెల.
వర్షం ఆగదు-లోపలా బయటా వర్షం ఆగదు.
ఎద్దుల కళ్లలోనూ-సారథి గుండెలోనూ వర్షం ఆగదు.
గుంటల్లోపడి లేస్తూ దిగబడుతున్న బండి చక్రాలు-
బురద దారికి జాలిలేదు-ఎదురు గాలికి జాలిలేదు
తెల్లారేవరకు వర్షం ఆగదు.
బతుకు తెల్లారే వరకు వర్షం ఆగదు-జాలిలేని వర్షం-
పశువుల మేత పడకవుతుంది.
జేబులోని కాగితం దేహం ఆచూకీ చెబుతుంది.
మనసు చిరునామా కనుకొలుకుల్లోంచి కారిపోతుంది.
మరోచోట మరోచోట మూసుకుంటున్న ద్వారాలకు ఢీకొని
మరో కన్నీటిబొట్టు బద్దలవుతుంది.

గాయం నా సహచరి

నీడను నేను అనుసరిస్తున్నానో?
నన్ను నీడ అనుసరిస్తున్నదో?

వెలుగు నాకు ఎదురైతే
నా వెనుక నడుస్తుంది.

దీపాన్ని దాటి వెళుతుంటే,
నా కంటే పొడుగై
నా ముందు నడుస్తుంది.

సూర్యుడు ఛత్రమో
కంటక కిరీటమో అయినప్పుడు,
మరుగుజ్జుగా
కుక్కపిల్లలా నా పాదాలు అల్లుకొని
మారాం చేస్తుంది.

శయనించాలనుకుంటే
నా దేహాకృతిలో
పడకగా మారుతుంది.

అంధకారం అలముకోగానే
ఒరలో కత్తిలా
నాలో ఒదిగిపోతోంది.
అంగరక్షకిలా కనిపించే ఆత్మరక్షకి!

సహగమనం చేసి
నాతోనే కడతేరుతుంది
నీడలాంటి నా గాయం,
గాయంలాంటి నా నీడ.

నా నీడలన్నీ
వెలుగు కుంచె ప్రసాదించిన కారికేచర్లు.

'ఆంధ్రభూమి' - ఆదివారం అనుబంధం-22-8-2004

ప్రవాహసూత్రం

రెండు అరచేతులుగా చీలిన గింజ మధ్య
ఆకుపచ్చని సూర్య అంకురం.
సుదూరాన రెండు కొండల అరచేతుల మధ్య
ఎదుగుతున్న ఎర్రనిమొక్క సూర్యుడు.

పరస్పరం అల్లుకుంటున్న అలలతో
దిక్కుల మధ్య దూరాన్ని కొలుస్తూ
ప్రవాహవేణి,
ఏటి తాడు.

నదికి, జడకు ఆద్యంతాల్లో విడిన పాయలు.
అప్పుడే పుట్టిన బిడ్డ బొడ్డుతాడు ముడి తొలికొస.
రెండు పాయలూ
దేనిని ఏది అల్లుకున్నదో తెలియని
గాఢాలింగనాద్వైత సూత్రం.

ఎన్నెన్నో మెలికల మజిలీలు.
ప్రతి మజిలీ పునరారంభబిందువే,

భూత భవిష్యత్తుల మధ్య స్వల్ప విరామ చిహ్నమే.

రెండు పాయల తాడును ఎటు తిప్పి చూసినా
ఒక్క పాయే కనిపిస్తుంది.
గెలుపు ఓటముల్లా
జనన మరణాల్లా

కొండల దోసిలిలోకో
సముద్ర మైదానాల్లోకో
పొలాల నాగేటి చాళ్ల నుదుటి ముడుతల్లోకో,
పశ్చిమాన గగనశాఖ నుంచి
రాలుతున్న సూర్యఫలం.

మలిచివరగాని తేలదు
-ఏ కొస పొడవైనదో?

ఆంధ్రజ్యోతి-ఆదివారం అనుబంధం-6-2-2005

సుదూర సామీప్యాలు

రంగు రంగుల పూలను వృత్తాకారంలో పేర్చి
దూరంగా నిల్చునిచూడు,
అదృశ్య అంతస్సూత్రమేదో బంధించిన
హారంలాగే కనిపిస్తుంది.

అది అందమైన ధవళవస్త్రమే.
కిటికీని చూసినట్లు
కాస్త దగ్గరగా చూడు.
అంతా వెలుగునీడల పడుగుపేకలు.

అది మనోధర్మ సంగీత సమ్మేళనమే,
చెవి ఒగ్గి వింటే
ఛిద్రస్వర స్వగత ఆర్తనాదమే.

అందరిదీ రాజమార్గమే.
అంచున నిల్చుని చూడు
ఎన్నెన్నో వెంట్రుకవాసి బీటలు.
నీ చూపులు మైక్రోస్కోపులైతే

దారి మేనులో అడ్డంగా దిగబడిన
అనేక ప్రవాహ ధారాకరవాలాలు.
నేల బారుగా పరచిన నిచ్చెనలా రహదారి.

ఆ గోడకేసి చూడు!
పికాసో, డాలీలను మరపించే
ఎన్ని అద్భుత అధివాస్తవిక చిత్రాలో!
దగ్గరగా జరిగిచూడు,
ఆగని అశ్రువర్షానికి నిలువెల్లా తడిసి
అలసిపోయి వేయి అర్ధనిమీలిత నేత్రాలతో...
సాంత్వనగా మునివేళ్ళతో తాకినా
ముక్కలై కూలిపోయే మానవకుడ్యం.

ఎంత మార్దవం, ఎంత లావణ్యం!
కొనగోటితో తాకినా పులకరించి
మూర్ఛనలు పోయి వేనవేల విద్యుత్తంత్రులతో
అంతరంగదేహాన్ని
క్షణంలో మోహ మాదకతలలో ముంచి తేల్చే
రాగప్రసారం-అనురాగ ప్రస్తారం.
ముద్దాడే ముందు
ముంజేతిని కాస్త నిశితంగా చూడు
అసంఖ్యాక స్వేద గ్రంథుల
శుష్క సూర్యకాంత క్షేత్రం.

అందరి పరుగులూ గమ్యం వైపే.
దగ్గరగా చూస్తే
ప్రతి అడుగులో పునరుత్థానంలోని తడబాటు.

దారి తప్పి నగరంలో కొమ్మకోసం అన్వేషిస్తున్న
జీవన విహంగ సదృశం.

పౌర్ణిమాకాశాన్ని చూసినట్లు
దేన్ని దూరంగా చూడాలి?
ప్రియురాలి కనుపాపల కదలికల్లో
అనేక సంకేత సందేశాలను అనువదించుకున్నట్లు
దేన్ని దగ్గరగా చూడాలి?

అద్దంలో తన ముఖాన్ని తాను
తేరిపార చూసుకోవడానికే జంకేవాడికి
ఏది దూరం? ఏది సమీపం?

'వార్త' ఆదివారం అనుబంధం - 27-5-2007

ఒక బాటసారి స్వగతం

కొత్త పౌర్ణములక్కర లేదు
దీపంపైన నీడలు ముసరకుండా ఉంటే చాలు.

కొత్త వసంతాలవసరం లేదు
రాలిన పూలు వాడకుండా ఉంటే చాలు.

సరికొత్త అనుభవాల సబ్బు నీటి బుడగల్లోని
సప్తవర్ణాలక్కర లేదు.
కపోలం మీది చివరి అశ్రువు అరకుంటే చాలు.

◆ ◆ ◆

సుదూరాన అడవిలోకి, వృక్ష సముదాయాల
మూలాల్లోకి
ఇంకిపోతున్న ముందు దారి.
కొండల వెనుకకు పాకుతున్న సర్పంలా
వెనుక దారి.
తిరస్కృత సిద్ధాంతాల్లా వెనుకకు నడుస్తూ
మైలు రాళ్లు.

సదా కనుచూపు మేరల్లో గమ్యం.
నాలాగే బాటసారిలా
సాంధ్య వేళ ఆగి ఆగి రాలుతున్న ఆకుల విలంబిత స్వరాలు.
పాంథశాలలో
వెలిగించిన ప్రమిదల కింది చీకటిని చెరపడానికి
మరో ప్రమిదను, మరో ప్రమిదను వెలిగిస్తూ....

◆ ◆ ◆

ఒక ప్రమిదలో చమురు ఇంకుతుంటే...
మరో ప్రమిదలోని జ్యోతిని ఏ గాలి తరగో
తుంచి పట్టుకుపోతుంటే....
శిరస్సు ఖండింపబడిన ప్రమిదల దేహాలు.
చివరి ప్రమిద కింది వణుకుతున్న చీకటిని
అనుకరిస్తూ నా నీడ.
రెండింటినీ పరిశీలిస్తూ నేను.
కొత్త వసంతాలవసరం లేదు
రాలుతున్న పూలు వాడకుండా ఉంటే చాలు

ఆంధ్రజ్యోతి-ఆదివారం అనుబంధం 20 నవంబరు, 2005

అనివార్యం

తొందరపడకు.
చీకటిపడినా కాసేపటికి
వస్తువులన్నీ మేలి ముసుగుల్లోంచి
ఓరకంట నిన్నే చూస్తాయి.
అన్వేషించకు.
గాయపడిన అంతరాత్మ నుంచి కారిన రక్తాన్ని తాగితాగి
తుప్పు పట్టిన మేకులా
మనస్సు ఎక్కడో రాలిపోయి వుంటుంది.

చింతించకు.
కాగితం మీదికి రాలిన నీటి చుక్క
కపోలం మీదికి జారిన కన్నీటి చుక్క
ఆరిపోయే లోపు
సగమైనా ఇంకిపోయి ఉంటాయి
కాగితపు కపోలం అంతరంగాల్లోకి.

జాలిపడకు.

కన్నీటి చుక్కలాగో
కదిలే కాంతి కళిక లాగో
తరుముకొచ్చే మరో నీటిబిందువుకు చోటివ్వడానికి
చూరునుంచి వాన చినుకు రాలక తప్పదు

బాధపడకు.

తాను ఎప్పుడో మరణించానని
తెలుసుకోవడానికైనా
ఏదో ఒక రోజు
మనిషి మేల్కొంటాడు.

6-8-04.

రెండు మిణుగురులు

ఒకప్పుడు చేయి తగిలితే గంట కూడా
పరిమళాల కువకువలను ప్రసరించేది
ఇప్పుడు పుష్పానికి చేయి తగిలినా
నా గుండె గంటగా మోగుతోంది

నీ నీడను కూడా దాటలేని నీ బాహువులు
ఈవలి తీరపు అంతరంగాన్ని అల్లుకున్నాయి.
నేడు నా అక్షరాల బాహువులు చాస్తున్నా
ఆకాశంలాంటి నీ అంతరంగందాకా!

నాడు నీ మాటొక ఇనబింబం,
నీ మౌనం ఒక శశిరేఖ.
నేడు సూర్య చంద్రులు
దారితప్పిన మిణుగురులు.

'వార్త' ఆదివారం అనుబంధం-9-5-2004

ముక్కలైన పద్యం

నువ్వు దారి మరచిన చోటూ
నేను రోజూ వెళ్ళకుండా ఉండలేని చోటూ ఒక్కటే.
మనం విడిపోయినచోటు.

◆◆◆

పరిచయాలన్నీ అపరిచయాలుగా
ముగియాలనుకుంటావు నువ్వు.
అన్నీ తిరిగి అపరిచయత్వం నుండి
మొదలవ్వాలనుకుంటాను నేను

◆◆◆

నా ఆలోచన ప్రతిక్షణం నీ గురించి.
నీవు ఎదురు పడగానే నా గురించి-
ఇంతకూ ఎవరు ఎవరిని అనుకరిస్తున్నాం

◆◆◆

లోకాన్ని చూశాక
మెలకువలో నిద్రిస్తున్నాయి నా కళ్ళు.

నీ కళ్ళు చూశాక
నిద్రలోనూ నిత్యజాగృత జీవితం నాది.

◆◆◆

మౌనం మనం నిర్మించుకున్న తొలి సమాధి
ఒకరి సమాధి మరొకరికి నిఘంటువు

◆◆◆

నన్ను వేధించేవి
జ్ఞాపకాలు మాత్రమే కావు.
జీవితంలో ఇమడని అనుభూతుల్లా
వాక్యంలో ఒదగని పదాలు.

◆◆◆

తెలియకడుగుతాను!
అద్దం అణువణువునా
నువ్వే ఉన్నావో లేవో తేల్చుకోవడానికి
నిలువెత్తు పద్యాన్ని ఇన్ని ముక్కలు చెయ్యాలా?

'వార్త' ఆదివారం అనుబంధం-7-8-2005

శూన్యవృత్తాలు

కాగితం మీద వృత్తాలు గీస్తూ మా అబ్బాయి.
గూట్లో పరిచిన గాజుల్లా
రంగురంగుల వృత్తాలు-శూన్య వృత్తాలు.

నగరంలోని శూన్యాన్ని తోట పూరిస్తుంది.
తోటలోని శూన్యాన్ని పూవు,
పువ్వులోని శూన్యాన్ని పరిమళం పూరిస్తాయి.

ఆకాశంలోని శూన్యాన్ని పెద్ద నక్షత్రం,
వెలుగులోని శూన్యాన్ని వెన్నెల,
వెన్నెలలోని శూన్యాన్ని పదునెక్కిన జ్ఞాపకం పూరిస్తాయి.
మసకబారిన జ్ఞాపకాన్ని
పెదవుల మీద పదునుదేరుతున్న పాట పూరిస్తుంది.
పాటలోని శూన్యాన్ని మానీమానని గాయం పూరిస్తుంది.

శూన్య హస్తాన్ని
కలిసి కదిలే మరో చెయ్యి మాత్రమే పూరించగలదు.
అసంపూర్ణ జీవన వాక్యాన్ని....

కొన్ని కన్నీటి చుక్కలు పూరిస్తాయి.

వృత్తాన్ని మరో వృత్తంతో కలుపుతూ,
వృత్తాల్లోని శూన్యాన్ని పూరిస్తూ,
వృత్తాల దండలల్లుతూ నిర్విరామంగా
ఇప్పుడు మా అబ్బాయి-

'విపుల' మాసపత్రిక-జూన్-2007

ఇంకొంచెం....

ఏకాంతంలో సమూహాన్ని సృజించుకోవడానికీ,
అనివార్య స్నేహ సమ్మర్దాలలో స్వీయ ఏకాంత సేవకూ,
అరచేతుల అద్దాల్లో నన్ను నేను చూసుకున్నట్లు
కొన్నింటిని బాగా పరిశీలించడానికి, సర్వేంద్రియాలకు
నిషిద్ధానిషిద్ధాలను నిర్దేశించడానికీ
ఇంకొంచెం సాధన కావాలి.
యాంత్రిక స్వీయ నియంత్రణా మంత్రసిద్ధి కావాలి.
క్షణక్షణం రూపం మార్చుకునే ప్రపంచ
మయసభా ప్రవేశానికీ, నిత్య నూతన వ్యూహాలతో
జీవన సమరాన్ని కొనసాగించడానికీ
ఇంకొంచెం ప్రజ్ఞ కావాలి.
అత్యాధునిక సమరవేద సాధన కావాలి.

నాలోని ప్రవక్తలను మేల్కొల్పడానికీ
నాలోని సైతానులకు జోలపాడడానికీ

నన్ను నేను వాచకంగా అధ్యయనం చేయడానికీ
సంచార మానవ గ్రంథాలయాల్ని ఔపోసన పట్టడానికీ
ఇంకొంచెం అభ్యాసం కావాలి.
మాదకతలోని మెలకువ కావాలి.

శాశ్వతంగా మరచి పోవలసిన వాటిని
నిరంతరం గుర్తుంచుకోవడానికీ,
నిరంతరం గుర్తుంచుకోవలసిన వాటిమీద
పేరుకుంటున్న మరపు మట్టిపొరలను ఊదేయడానికీ
ఇంకొంచె స్మృతి శాస్త్ర అధ్యయనం కావాలి.
నిత్యజాగృత మాదకతలోని స్వప్నమారుతాలు కావాలి.

బౌద్ధికంగా అనుభవించడానికీ
హార్దికంగా వివేచించడానికీ
అనివార్య లోహ శృంఖలాలను ఛేదించడానికీ
ఐచ్ఛిక బంధనాల సుగంధాలను ఆఘ్రాణించడానికీ
అశ్రువులు అనామకంగా రాలిపోకముందే
అక్షర మౌక్తిక మాలలు కూర్చడానికీ
ఇంకొంచెం ఆచరణాత్మక అనుభవ ప్రావీణ్యం కావాలి.
తనను శుద్ధి చేస్తున్న అశ్రువు అంతర్లోకాలను
తక్షణమే దర్శించే మైక్రోస్కోపుల
కనుపాపలు కావాలి, ఏకకాలంలో బహురూప
ప్రదర్శనా కళా నైపుణ్యం కావాలి.

నీటిబుడగలో సౌరకుటుంబాన్ని, సౌరకుటుంబ
సంచారంలో విహంగ విచిత్ర విన్యాసాల్ని
చూడగలిగే సులోచనాల శుభ్రదృష్టికావాలి.

శ్మశాన, ఉద్యాన వనాల మధ్య దృశ్యాదృశ్య
విభజన రేఖను రహదారిగా మార్చుకోడానికీ
ఈ వికృత లోకాన్ని ధిక్కరించడానికీ,
వెక్కిరించడానికీ

ఇంకొంచెం నిబద్ధతా మాదకత కావాలి!
మాదకతలోని సతార్కిక సాహసం కావాలి!

చిత్ర కవి

ఆనందంతోనో ఆవేశంతోనో ఉప్పొంగి
రెండు బిందువులను కలిపే ఒక రేఖ
అంబర చుంబిత శిఖరం

ఒక అర్ధవృత్తం దిగంతమవుతుంది.
కాగితం మీద కదలని క్రీనీడ
కాంతి ప్రస్థానాల సూక్ష్మదర్శిని.

కాన్వాసుమీద ఎగురుతున్న ఎండుటాకు
వాయువేగ కొలమానం.

కొమ్మ నుంచి రాలుతున్న కుసుమ నేత్రాలలో
అనంతాకాశం.
లంబరేఖ చివర వికసించిన పుష్పాలు
గగనాన్ని ప్రశ్నిస్తున్న పిడికిళ్ళు.

కొన్ని రేఖలు
చిలిపిగా వెక్కిరించే ప్రేయసి కటాక్షాలు.

మరికొన్ని రేఖలు-
పతంజలి భాష్యాలు,
లఘుసిద్ధాంత కౌముదులు.

పేజీకి ఒక మూల
రెండు గీతల పడుగుపేకలు.
ఆవలి తీరాన నింగి పడవకు వేసిన లంగరు.

మనకు తెలియని రెండు వర్ణాలు కలిసిపోయి
సుదూర తీరాలను ప్రత్యక్షం చేస్తాయి.
మరో అస్పష్ట వర్ణమేదో
సుదూర సామీప్యాలను ఏకం చేస్తుంది,
దూరాలను చెరపకుండానే
అగాథంతో అంబరాన్ని జోడిస్తుంది.

జగమంతా
అతనికి రెండు రేఖలు,
రెండు సమ్మోహన వర్ణాలు-
అతని లేఖిని చివర
రేఖలు పురివిప్పుకుంటాయి
అతని వేళ్ళ చివర రంగులు శిలాక్షరాలవుతాయి.
వర్ణాలు రంగులద్దుకుంటాయి.
అతనిది సువర్ణ రేఖాలిపి.
అతడు చిత్రకవి!

ఆ సమయాన

ఆ సమయాన....
మనుషులు ఆకృతులు కోల్పోతారు,
వస్తువులు వస్త్రాలు విప్పేసుకుంటాయి.
నా పెదవిని చుంబించిన పాత్ర
యశోదకు చూపిన బాలకృష్ణుడి నోరు-
ఇక ప్రవక్తలందరూ కాసేపు
నా ముందు మోకరిల్ల వలసిందే!

అంతలోనే దారితప్పిన బాటసారినన్న అర్ధసత్యం
నూటొకటోసారి అకస్మాత్తుగా తెలియగానే జ్ఞానానందం...
మనసు మీది పచ్చబొట్టు
తేనెపట్టుగా మారుతుంటుంది.
"జిసే భూలాయే కయీసాల్ హోగయే
మై ఆజ్ ఉసీకీ గలీసే గుజర్ గయే కైసే"
మెహిదీహసన్ ఆశ్చర్యపోతుంటాడు స్వగతంలో.

దారి ఏదో తన దారిని మరచి
నా కాళ్ళను చుట్టుకుని దారిచూపమంటుంది.
అరవిరిసిన పుష్పాలు,
అర్ధనిమీలిత హృదయాలు
రహస్యంగా తమ ఆత్మకథను చెబుతుంటాయి.
జీవన సారాంశమేదో
వాక్యాలను పదాలుగా, పదాలను అక్షరాలుగా మార్చుతుంటుంది.
సందేహాలన్నీ కరిగి కనుకొలుకుల్లోంచి కారిపోతుంటాయి.
ఆకాశం రెండు ముక్కలై
విశ్రాంతి కోసం కనురెప్పలపై వాలుతూంటుంది.
అప్పుడు నాలో
ఎన్నెన్నో చిరునవ్వుల చంద్రరేఖలు.
అప్పుడు నాముందు
బోర్లించిన మధు పాత్ర గగనం కింద
వృత్తాకారంగా గిరికీలు కొడుతూ
గిలగిలాకొట్టుకుంటూ లోకమక్షికం.

ఆంధ్రప్రభ-'సాహితీగవాక్షం'-20-11-2004

దేహానికి ప్రేమలేఖ

అన్నీ కోల్పోయినాక కాని తెలియదు,
వలచి వచ్చిన వనిత విలువ.
నన్ను బతికించుకోవాలంటే
నిన్ను రక్షించుకోవాలని అప్పుడే తెలుస్తుంది

నన్ను వెలిగించే చమురువు నువ్వే,
అన్ని సుడిగాలుల నుంచి రక్షించే
పారదర్శక కవచానివీ నువ్వే.
నేను మరింత నాగరికంగా కనబడాలని
నన్ను మరుగుపరిచేదీ నువ్వే.
పక్షి దుఃఖాన్ని తుడవడానికి
కన్నీటి కొంగునందించే పంజరానివీ నువ్వే.

పూలతోట, ఎడారికి కట్టిన ముళ్ళకంచెగా
దర్శనమిచ్చినప్పుడే తెలిసింది,
నేత్రాలు ఒకేవైపు దారి ఉన్న గవాక్షాలని,
రెప్పలు రెక్కలని,

కన్నీటి తెరలు కర్టెన్‌లని.

ఏ చినుకు స్పర్శించినా
సరస్సు అణువణువునా పూర్ణ చంద్రబింబాలే.
ఏ రాయి పిడుగులా రాలినా
ముక్కలైన చంద్రుణ్ని కలిపి కుట్టే అలల చేతులు-
బహుశా ఎప్పటికీ నువ్వూ నేనూ
సరస్సూ చంద్రబింబాలమే.
"కోఽ హం" అంటూ బయల్దేరిన వారందరూ
"త్వమేవాఽ హం" వద్దకే చేరుకోవాలేమో!

నిన్ను పంజరమనుకుని,
నీ తలుపులు తెరుచుకుంటే
ఈ తుఫాను హోరులో
నేనెక్కడైనా వాలగలనా? అని చింతించాను.
నువ్వు ముళ్ళతోటలో
ఎగిరే బెలూనుగా కనిపించినప్పుడే
నేనేమిటో తెలిసింది.

'వార్త' ఆదివారం అనుబంధం. *21-11-2004*

బాధించని గాయం

ఏదీ క్షణికమూ కాదు, శాశ్వతమూ కాదు
బాధలాగే-
మానిన గాయల తొలగని బాధలూ,
మాసిపోయిన బాధల మానని గాయాలూ,
అన్నీ కన్ఫెషన్ కావ్యంలో అధ్యాయాలే.
ప్రేమ వ్యక్తీకరణలో లాగానో
మరణ వాఙ్మూలంలో లాగానో
అభ్యాసం చేసిన పదాలన్నీ కరిగిపోగా
కేవలం విరామ చిహ్నాలే పదాలుగా,
పదబంధాలుగా మిగిలిన మహావాక్యాలు.

ఏ నొప్పీలేని గాయం,
అప్పుడప్పుడూ అప్రయత్నంగా
రెండు అరుణాశ్రువులను రాల్చే గుడ్డి కన్ను.

బాధలేని గాయాలు ఆరిన రంగులపాత్రలు.
తడిఆరిపోయి బిగుసుకున్న కుంచెల అంతరంగాలు.

శాశ్వత మౌనముద్రలో
ఎప్పటికీ కలవని గాయాల పెదవులు

ఎంతటి జల హృదయంలోనైనా
ప్రతిబింబాలు తలక్రిందులుగానే మొలుస్తాయి.
కీటకాలకైనా పర్వతాలకైనా
నీడలన్నీ నిలకడలేనివే, బహురూపులే.

వాస్తవాన్ని మించిన
వాస్తవిక స్వప్నాలను భరించడం కష్టం.
బాధించని గాయాలను భరించడం మరీ కష్టం.

క్షణికాలన్నీ శాశ్వతాలే!
శాశ్వతాలన్నీ క్షణికాలే!
గాయంలాగే.

'వార్త' దినపత్రిక- 27-8-2004

అప్రమేయంగానే....

కొన్ని అప్రమేయంగానే వచ్చి చేరతాయి.
దుస్తుల కంటుకున్న ఇసుక రేణువులా,
గాలాల దుస్తులు ధరించిన
పల్లేరు లా,
బాటసారి జేబులో రాలిన పూరెమ్మలా.

తేమ ఆరిపోగానే
వచ్చినంత నిశ్శబ్దంగా రాలిపోతాయి ఇసుకరేణువులు.
వేళ్ళ చివర కొన్ని చిట్టి గులాబీలను వికసింపజేసి,
జీవన వస్త్రానికి కొన్ని శిథిల గవాక్షాలను అమర్చి
పల్లేరు కాయలూ నిష్క్రమిస్తాయి.
మనిషిని కస్తూరి మృగంగా మార్చే జేబులోని పూరెమ్మను
వాడకుండా కాపాడనూలేము,
పారేయనూలేము.

ప్రపంచ వస్త్రానికంటుకున్న ఇసుక రేణువులం,
స్పర్శించిన దానినల్లా అంటుకు తిరిగే పల్లేరు కాయలం,
అనూహ్య సుగంధ బుద్బుదాలం మనమేనని?
చివరకు రాలేటప్పుడుగానీ తెలియదేమో!

కొన్ని అప్రమేయంగానే వచ్చి చేరతాయి,
వచ్చినంత నిశ్శబ్దంగానే రాలిపోతాయి.

'ఆంధ్రప్రభ' - 'సాహితీగవాక్షం' - 20-6-2005

లోకమూ - నా ప్రియురాలు

నువ్వు మారాలని నేను... నన్ను మారమని నువ్వు...
మన మధ్య దూరమెంతైనా
ఓరకంట కనిపెడుతూనే బతుకుతుంటాం పరస్పరం.
నన్ను నీలో లీనం చేసుకోవాలనుకున్నా,
నువ్వు నాతో కలిసి నడవాలనుకున్నా,

మన మధ్య దూరాలు చెరిగిపోయినా,
ఒకరి చేయి మరొకరికి
నడుస్తున్న కొద్దీ దూరమయ్యే మంచుతెర.
నీ చూపుడువేలు బహుదీర్ఘం,
నేనెక్కడ ఉన్నా నన్నే దోషిని చేస్తుంది.
కాలప్రవాహానికి మార్గదర్శకులం, మౌనసాక్షులం-అయినా
ప్రవాహాన్ని అనుసరించి మనం ముసలుకొంటున్నామో?
ప్రవాహమే దూరాన్ని పెంచుతున్నదో? సందేహం తీరదు.
ఈ ప్రవాహం ఏదో ఒకరోజు పొంగిపొర్లి

మనల్ని ఏకం చేస్తుంది-లేదా
మన ఉనికినే రద్దు చేస్తుంది.
మనం భిన్న ధ్రువాలమైనా
ఇద్దరి మరణ వాంఙ్మూలాలూ ఒకే వాక్యం.
విన్సెంట్ వ్యాంగో చివరిసారిగా అన్నట్టు
"నీకెన్నో చెప్పాలనుకున్నా, కానీ నిష్ప్రయోజనం"
ఒకప్పుడు ప్రియురాలే నా లోకం.
ఇప్పుడు లోకమే నా ప్రియురాలు.

స్వప్న శకలాలే నాకు ఆనవాలు

కాంక్షలన్నీ వీడ్కోలు చెప్పినవేళ నువ్వొచ్చావు.
నా గుండెసవ్వడిలో నీ పదధ్వనిని విని
నలువైపులా వెర్రిగా వెదుకుతున్నవేళ,
చెదిరిన గోవులను చేరబిలిచే వేణుగానంలా వచ్చావు.
నిట్టూర్పుగాడ్పుల్లో ప్రాణజ్యోతి రెక్కలు కొట్టుకుంటున్నవేళ
రజనీగంధంలా నువ్వొచ్చావు
అర్ధచేతుల్లో కాంతిలేని అగ్నిజ్వాలను మోసుకుతిరుగుతున్నవేళ
ఏమీ ఆశించని అతిథిలా వచ్చావు.
గులకరాయిని ప్రవాహంలోకి విసిరినట్లు
విసుగుతో హృదయాన్ని విసిరికొట్టినవేళ,
ఖండించటమే తప్ప జోడించటం తెలియని
జ్ఞానఖడ్గాన్ని శిలువలా మోసుకుతిరుగుతున్నవేళ వచ్చావు.
హంపీసప్తస్వరమండపంలో, నీ సమక్షంలో,
ఏ స్తంభాన్ని మీటినా నీ పేరే ధ్వనించగా
నేనూ ఒక స్తంభాన్నైన వైనాన్ని గుర్తుచేస్తూ నువ్వొచ్చావు.

ముంగిట అంతిమ సహచరితో పరిహాసమాడుతూ
పయనమవుతున్నవేళ వచ్చావు.
నిన్న నా చుట్టూ నిరీక్షణానిశీథి ఒక లోహకుడ్యం.
నేడు కారుణ్యకాంతిపంజరం.
నీ రాక నా కోసమేనా?
నీవు వీథిలో వెళుతుంటే నాకోసమేనని భ్రమించానా!

నీ క్రీడాసామగ్రిలో గ్రహరాశి ఒక అక్షపటం.
నీ దరహాసం మౌన నిఘంటువు.

నా ద్వారానికి ఒక స్వప్నపుష్పాన్ని అలంకరించి వెళుతున్నావు.
వేసంగి గాడ్పులనుండి, శైశిర కరవాలాలనుండి రక్షించుకుంటాను
చిరుకానుకలను సిద్ధంచేసుకొంటాను.
నీవు తిరిగివచ్చేవరకు ఈ కుటీరం ఇలాగే ఉంటుందా?
స్వప్న శకలాలే నాకు ఆనవాలు.

'చైతన్య కవిత' (36&37) ఏప్రిల్ & అక్టోబర్ 2002 సంచిక

గాలం చివర...

లోకప్రవాహంలోకి
చూపుల గాలాన్ని విసిరి
ఒడ్డున కూర్చున్నా!
కాసేపటికి
కొండంత బరువు!
పెద్ద చేప కావచ్చా!
నీటిలోకి తొంగిచూస్తే
లీలగా కనిపించింది.
గాలం చివర నా హృదయం!
దీనిని బయటకు లాగనూ లేను
వదిలేయనూ లేను
విసిగిపోయి..చివరికి
గాలాన్ని ప్రవాహంలోకి విసిరేసి
తిరిగొచ్చేశా
ఇప్పుడు అందరిలాగే....
సమూహంలో ఏకాకిగా...
ఏకాకి సమూహంగా... హాయిగా...

రెండు తలలు

ఒకే దేహానికి తలలు రెండైనప్పుడు
శబ్ద రూపరసగంధాదులన్నీ విభిన్నమే.
ఏతలా వెనుకకు చూడలేదు;
వెనుకకు నడువలేదు, ఏదీ నిశ్చలంగా ఉండలేదు.
దేని ఆకలి దానిది దేని అవసరం దానిది,
దేని ఆలోచన దానిది దేని అనుభూతి దానిది,
దేని లక్ష్యం దానిది

ఒకేసారి ఎన్నింటినో ముట్టడించే వ్యూహాలలో
మెలికలు తిరుగుతూ...
తమ దేహానికి తామే ముడులు వేసుకుంటూ...
దేహమంతా ముడులదండ.
కొన్ని ముడులను ఎవరూ విప్పలేరు, ఎవరూ విప్పుకోనూలేరు.

రెండు తలల వ్యతిరేకదిశా యానంలో
బిగుసుకుంటున్న ముడులు.
ఏ ముడిని ఏ తలా విప్పుకోలేక
ఊపిరాడక మరణావస్థలో
ఒకరి నొకరు నిందించుకుంటూ..... రెండు తలలు

తెలిసి తెలిసీ....

అంతా అసత్యమని తెలిసి, తెలిసీ
అంతా వాస్తవమేనని విశ్వాసాత్మకంగా భ్రమపడాలి.

అంతా అశాశ్వతమని తెలిసి తెలిసీ
అంతా ఆచంద్రార్కమనే భ్రమను
సప్రయత్నంగా విశ్వసించాలి.

అన్నీ వాస్తవమేనని తెలిసి తెలిసీ
అర్ధనిమీలిత ఆలోచనతో
అన్నీ అదృశ్యాలేనని ప్రకటించాలి.

కొన్నింటికి ఆరంభమేతప్ప
ముగింపులుండవని తెలిసి తెలిసీ
ఎప్పటికప్పుడు
దీన్ని ఇంతటితో ముగించాలనుకుంటాం.
ఒకే ఒక్క చోట గెలుపు కోసం

తెలిసి తెలిసీ
వందచోట్ల ఆత్మహత్య చేసుకోవాలి.
అనాలోచితంగా ఆరంభమై
అసంకల్పితంగా ముగిసే ఆశ్వాసాలు,
ఆశ్వాసాంత గద్యలు లేని అఖండ కావ్యంలో
అస్వతంత్ర అధ్యాయాలు.

ప్రతిపుటలో
ఎన్నెన్నో అనివార్య అసంపూర్ణ వాక్యాలూ..
అర్థోక్తులూ.....
ప్రతిరెండు విశ్వాసాల మధ్య
విస్తరిస్తున్న రక్తసముద్రాలు.

నిత్యం వెంటాడే ఆరంభాలను
అర్థాంతరంగా మరచి పోవాలి.
అర్థాంతర ఆరంభాలకు
సార్థకంగా ముగింపు పలకాలి.
అసాధ్యమని తెలిసి తెలిసీ....
జీవన ప్రహేళికను
పూరించే ప్రయత్నంలోనే అందరూ!

అనిర్వచనీయం

నెలవంక:

నల్లని పందిరి మీది నఖక్షతం

చిరునవ్వు:

అశ్రుసముద్రాల ఆటుపోట్లలో ఎగసిన అల

జ్ఞాపకం:

వర్తమాన గ్రీష్మదాహానికి చలువ పందిరి

మనసు:

జ్ఞాపకానికి స్వప్నానికి మధ్య
బతుకు మగ్గంలో దారపు కండె

వ్యాపకం:

మెలకువగా ఉండడానికి వాడే నిద్రమాత్ర

జీవితం:

బాధ్యతల కొనగోటిమీది నాణెం- లేదా
రసాభాసగా ముగిసే బహుపాత్రాభినయం.

అతడు

అన్నిరకాల చత్వారాలకు, వర్ణాంధత్వాలకు
అక్షర అశ్రు సులోచనాల నందించే నేత్ర వైద్యుడతడు.

సమస్త విద్యుత్ ప్రవాహాలూ
నిస్తబ్ద ఇసుక మైదానాల్లో ఇంకిపోయిన వేళ,
ఎవరికి వారు వెతికివెలిగించుకునే
దీపస్తంభపు నమూనా కొవ్వొత్తి అతడు

జనసమ్మర్ద సముద్రంలో ఒంటరి ద్వీపం,
సమున్నత హరితదీప దిక్సూచి అతడు.

రాజమార్గాలను లోయలుగా,
లోయలను రహదారులుగా మారుస్తున్న
నిశ్శబ్ద ప్రకంపనాలను కొలిచే భూకంప శాస్త్రవేత్త అతడు.

అందరి అంతరంగాల దృశ్యాదృశ్య అశ్రు సూర్యకుటుంబాల
అక్షర అక్షయ రుద్రాక్షమాల అతడు.

యాత్ర

"I am a wonderer
so let that be my name:
The winter rain"   -Basho

ఏదీ నిశ్చలంగా ఉండదు.
నిశ్చైతన్యం మృత్యువుకు ఆముఖం.

ఏదీ స్థిరంగా ఉండదు,
ఏదో ఒక దిశలో పయనిస్తూనే ఉంటుంది.

ఆలోచన వెనుకకు సాగితే జ్ఞాపకాల జాతర,
సింహావలోకనం.
ఆలోచన ముందుకు సాగితే
ఊహాచిత్రం, స్వప్నలోకం.
చలించేదేని అంతస్సారాన్ని గ్రహించాలన్నా కదలక తప్పదు
జీవన ప్రవాహమూ,
ప్రవాహ జీవనమూ
తమదారి తామే నిర్మించుకుంటూ పయనిస్తాయి.

భ్రమణమూ, పరిభ్రమణమూ....
ఏకకాలంలో రెండు యాత్రలు.
లోపలికీ, బయటికీ
పరస్పర వ్యతిరేకదిశల్లో
ఒకేసారి మరో రెండు యాత్రలు.
కక్ష్యమారినా, వేగం మారినా
మిగిలేది ఆత్మ హననం

లోలోపలికి దృష్టి సారించి
అంతరంగ అంతర్భాగాలలోని
పురామానవుడి గుహాచిత్రాలు దర్శించాలి.
మనోవేగంతో పోటీపడుతున్న ప్రపంచానికి
నీ చిటికెన వేలు నందించాలి.

అణువు నుంచి అజాండం వరకు
అన్నీ, అందరూ
సహజ, నిర్బంధ అనివార్య యాత్రలలో...

తల్లిగర్భం నుంచి నేల తల్లి గర్భంలోకి చేసే
సుదీర్ఘ బుద్బుదయాత్రలో ఎన్నెన్నో అంతర్యాత్రలు.

ఒకానొక రాత్రి

గొంతులో అడ్డంగా గాజుముక్క గుచ్చుకున్నట్టు
మాట పెగలదు.
కనురెప్పల్లోంచి బాణం నిలువుగా దిగినట్లు
మూతపడని కళ్ళు.
భయంకరమైన పక్షుల రెక్కల్లా
కనుతుదల కదులుతున్న కిటికీ తెరల నీడలు.

ఏ ఆవేశంలోనో రెండు కాళ్ళూ ఖండించుకుని,
తిరిగి అతికించుకోలేని నిస్సహాయ నిష్ఫలరోదన.

మెదడులో కాలుతున్న కొవ్వొత్తుల ఉష్ణద్రవం
దేహమంతా వేళ్ళు చాచుతుంది.

కనుల ముందే పాలుపొంగి
నిప్పుల్లో పడిపోయిన వెగటువాసన.

తెరచిన పుస్తకంలో
లోహ చక్రాలైన అక్షరాల మీద
జారి విరిగి పడుతున్న చూపుల సూదులు

శూన్యపంకంలో నిలువునా కూరుకుపోయిన
గడియారం ముళ్ళు

ఆరేసే ముందు ఉతికిన వస్త్రాన్ని మెలిపెట్టి పిండినట్లు
నాకు నేనే మెలికలు తిరిగి బిగుసుకుంటూ.....

ప్రవాసంలో ఉన్న ప్రేమికుల్లా కనురెప్పలు.
కనురెప్పల గట్లొరిసి పారుతూ
తిమిరకేశ ప్రవాహాలు.
కనుగుడ్లు చితికి నీరైపోయినా బాగుండు!

ఇష్టంలేని అతిథులతో
క్రిక్కిరిసిన ఇల్లులా మనస్సు.
మరుక్షణం-
ఆత్మీయులందరూ విడిచివెళ్ళిపోయిన తర్వాత
శూన్యశిథిల గృహంలానూ మనస్సు.

పశ్చాత్తాపాల రంపాల శయ్య మీద
ఏ వైపు ఒత్తిగిల్లినా ఒకే సుఖం.

ఒక శూన్య వృత్తం
మరో శూన్య వృత్తం చుట్టూ తిరుగుతున్నట్టు
నా చుట్టూ ఈ రాత్రి....
ఈ రాత్రి చుట్టూ నేను....

ఎంతకూ తెల్లారని నా బతుకులా
ఈ రాత్రి....

జలదీపం

సరస్సులో దూకి,
సరస్సులోని ఆకాశం ఒడిని చేరిన చినుకు
వెంటనే సూక్ష్మ జలకందుకంలా పైకెగిరి,

ఒకే ఒక్క క్షణం
నీటి ప్రమిదలో జలదీపంగా వెలిగి,
లోకాన్ని,
తాను సృజించిన జలవృత్తాలను, అంతర్ వృత్తాలను
చివరిసారిగా తేరిపార చూసుకుని
తన ప్రస్థానం ముగించింది

చినుకుదెంత అదృష్టం!

మాట్లాడే కపాలం

కాగ్వా వేటకు బయలు దేరాడు. పొదలను అడవులను దాటి
అతడి ఈటె సింహాన్ని వేటాడింది.
ఒకరోజు అడవిలో కనిపించింది మానవ కపాలం.
"నువ్వు ఈ స్థితికి ఎలా వచ్చావు?" అడిగాడు కాగ్వా.
"మాట్లాడడమే నన్నీ స్థితికి తెచ్చింది" - చెప్పింది కపాలం.
ఇంటికి తిరిగి వచ్చిన కాగ్వా, రాజు దగ్గరకు వెళ్ళి
అడవిలో నేనొక మాట్లాడే కపాలాన్ని చూశానన్నాడు.
నిశ్చేష్టుడైన రాజు, పుట్టినప్పటినుండి మాట్లాడే కపాలాన్ని చూడలేదు వినలేదని
ఆశ్చర్యపోయాడు.
భటులను పిలిచి "ఇతనితో వెళ్ళి మాట్లాడే కపాలాన్ని తీసుకురండి,
ఇతడు చెప్పింది అసత్యమైతే, కపాలం మాట్లాడకపోతే,
ఈ కాగ్వాను చంపేయండి" ఆజ్ఞాపించాడు రాజు.
రాత్రింబగళ్ళు నడిచి అడవిలోకి వెళ్ళిన భటులకు
చివరకు కపాలం దొరికింది.

"నువ్వు ఈ స్థితికి ఎలా వచ్చావు?" అడిగాడు కాగ్వా.
కపాలం నోరు విప్పలేదు,
దీనంగా అర్థించాడు కాగ్వా.
కపాలం మారు పలకలేదు.
తలవంచిన కాగ్వాను భటులు కత్తులతో ఈటెలతో పొడిచి చంపేశారు.
అప్పుడు నోరు విప్పిన కపాలం కాగ్వాను అడిగింది
"నువ్వు ఈ స్థితికి ఎలా వచ్చావు" అని-
"మాట్లాడడమే నన్నీస్థితికి తెచ్చింది" - అని
మృతుడైన కాగ్వా జవాబిచ్చాడు

ఆంగ్లమూలం : ఎడ్వర్డ్ లాబరీ (ఇంగ్లండ్)

ప్రశ్నల ప్రవాహంలో.....

ఎందుకు దూకానీ ప్రవాహంలోకి?
లోతు, పొడవు, వైశాల్యాలు తెలియకనా?
ఎదురీదాలనా?
అడ్డంగా ఈది ఆవలివైపు చేరాలనా?
ఏ సాగర సంగమాన్ని కాంక్షించి?
ఎందుకు దూకాను?
నాకే తెలియని ఏ రహస్య గాయాలను దాచుకోడానికి?
ప్రేక్షకుడిలా ఉండలేక,
ఎక్కడో మునుగుతూ మరెక్కడో తేలుతూ
యోగాసనాల జలక్రీడా విన్యాసాలతో
ఎవరి వినోదం కోసం?
ఎవరి కరతాళ ధ్వనులకోసం? ఎందుకు....
అనుక్షణం సలిపే ఏ గాయాల మౌన రోదనను మరువడానికి
తీరంలో హాయిగా పిట్టగూళ్ళు కట్టుకోకుండా,
ఒక యాత్రికుడిలా ప్రవాహ ఛాయా చిత్రాలతో
వెనుదిరుగకుండా - ఎందుకో?

ఏ మలినాల క్షాళనకోసం?
జల ఉత్తరీయంతో ఏ స్వేదాన్ని తుడుచుకోవాలని?
దోసెడు జలదర్పణంలో
ఏ నా అంతరంగ ముఖ బింబాన్ని చుంబించాలని?
ఎందుకు దూకాను?

క్షణక్షణానికీ మారే ప్రేక్షకులు.
ఊహించని మలుపుల మజిలీలు
ఆవలితీరం శరవేగంతో వెనుకకు కదులుతుంటే,
ఇరు తీరాల భుజాలమీద చేతులేసి జలకాలాడాలని
ఎందుకు దూకాను?

ఏ అలల పడగల మీద తారంగమాడాలని?
ఏ అలల శిలలమీద గాలి తరగల ఉలులతో
ఏ నినాదాన్ని లిఖించాలని?
ఏ జలశిల్పాన్ని మలచి,
ఏ హృదయ తీరంలో ప్రతిష్ఠించాలని?
ప్రవాహంలో ముక్కలవుతున్న
ఏ సూర్య బింబాన్ని కలిపి కుట్టాలని?
ప్రవాహంలోని ఏ నెలవంక మకుటాన్ని ధరించాలని?
ఎందుకు? ఎందుకు దూకానీ అక్షర ప్రవాహంలోకి?
ప్రవాహం బయట మాత్రమేనా?
నా లోపలా మరో ప్రవాహం!
ఏక కాలంలో ప్రేక్షకునిగా, పాత్రధారిగా,
ఒక ప్రవాహంలో మునుగుతూ,
మరో ప్రవాహంలో తేలుతూ....
అందరమూ ఎవరి ప్రవాహంలో వాళ్ళం ....

'ఆంధ్రభూమి' 'సాహితి'18-6-2007.

పాక్షికం

కనుల ముందరి అనేక బీభత్స దృశ్యాలలో
ఒక్కొక్కరికీ ఒక్కొక్కటే కనిపిస్తుంది.
తాము చూడదలచుకున్న దృశ్యం ముందే
అందరి కనులూ తెరచుకుంటాయి.
తాము వినదలచుకున్నదే లోకైక ఆర్తనాదం.
ఒంటి స్తంభం మేడల మధ్య
వ్యాకరణ విరుద్ధ సంభాషణ.
విరామ చిహ్నాలు లేని వచన కవిత్వంలా,
ఏ వాక్యం ఏ వాక్యానికి ఆరంభమో,
ఏ వాక్యానికి పొడిగింపో అర్థం కాదు.

ప్రశ్నలకు, ప్రశ్నలే జవాబులు.
జవాబులను పట్టించుకోని ప్రశ్నల పరంపర-
తాము ఆశించే జవాబుల కోసం సృజనాత్మక ప్రశ్నలు
ఎవరూ వినిపించుకోని ప్రశ్నలకు
ఎవరికీ తోచని ప్రశ్నలకు

జవాబులలోని వ్యూహాలకు, ప్రశ్నలలోని ఎత్తుగడలకు
కాలమే తెర తీయాలి!

పోటెత్తే ప్రవాహాన్ని ఎవడాపగలడు?
ఒక వైపు తలుపులు మూసేస్తే
మరోవైపు కట్టలు తెంచుకుంటుంది

చాల సందర్భాలలో మాటలకంటే మౌనమే
అంతర్యానికి నిలువుటద్దం!

నిశ్శేషం

తొలుత నీవు నన్ను కనుగొన్నావో?
నేను నిన్ను గమనించానో?
మన చేతుల మధ్య శాశ్వతంగా
మనసుకు మనుగడకు మధ్యనున్న సామీప్యమే!

అనామక కీటకంలా అదృశ్యతంత్రుల మీద పాకుతూ,
బహుదూరపు విహంగంలా
గడచిన దారిని చెరిపేసుకుంటూ,
శూన్యాటవిలో దారిచేసుకుంటూ,
నాముందు నుంచే సాగిపోతూ నువ్వు!

తాకీ తాకకుండా నా చరణాలను చుంబిస్తూ,
బలవంతంగా లాగేసుకుంటూ,
దూరదూర సైకత క్షేత్రాల్లోకి విసిరేస్తూ,
మునుముందుకు సాగుతూ నువ్వు!
మూగసాక్షి తీరాన్ని నేను!
అంతరంగంలో అల్లుకున్న అడవుల్లో

నిత్యం దారితప్పుతూ నేను.
గుట్టలను చీల్చుకుంటూనో
పర్వతాలకు ప్రణమిల్లుతూనో
నిశ్శబ్దయాత్రలో నువ్వు.
నా అంతిమ యాత్రకు నిర్లిప్త ప్రేక్షకుడిని నేను.
నా అసమర్థ అనువాద కవితవు నువ్వు.
నా ప్రతిబింబపు విచిత్ర శిథిలా కృతులను చూస్తూ
ఉన్నచోటే సమూలంగా ఒరిగిపోతున్న శుష్క వృక్షాన్ని,
నిరుపయోగ పశ్చాత్తాప కావ్యాన్ని.
నాతోనే కలిసి నడవలేని నేను,
ఎవరికి సహచరుణ్ణి కాగలను?

జీవిత ఖైదు అనుభవించిన తర్వాత వేయబడిన
ఉరిశిక్షకు అరక్షణం ముందు
నేర అంగీకార పత్రం మీద నేను చేసే సంతకం:
అది నా అంతిమ శ్వాస

పేరు పెట్టి ఎవరో నన్ను పిలిచిన సవ్వడి
గాలి హోరులో కలిసిపోతూ.....
అలల అధరాల నుంచి అస్పష్ట శబ్దపరిమళాలు

నేను భగీరథుణ్ణీ కాను... గౌతమ మహర్షినీ కాను
ఎవరో క్రీడగా వదిలిన ఒట్టి ఒంటరి కాగితం పడవను

(జగ్‌జీత్ సింగ్ పాడిన "ఆప్‌కో దేఖ్‌కర్ దేఖ్‌తా రహా గయా,
క్యాకహూం ఔర్ కహనే కో క్యా రహా గయా!" అనే గజల్ నన్ను వెంటాడగా రాసిన కవిత
ఇది.)

ప్రవాసం నుంచి ప్రవాసానికి

"The poet retreats in order to advance"
– Yevgeny Yevtushenko

అతడుండాలనుకున్నచోట అతడుండలేదు
అతడుండాల్సిన చోటా ఆతడుండలేదు

ఆర్ద్రనయన చరణాలతో
రక్తసిక్త పద్యపాదాలతో
అంతా ప్రవాసం...ప్రవాసం...

ప్రవాసం పలాయనం కాదు
వెలుగుకు వెన్నుచూపితే
మనకంటే ముందు మన నీడ గమ్యం చేరుకుంటుంది

ప్రవాసం-అదృశ్య స్వరంతో చాటే జిజీవిష
ప్రవాసం-మృత్యువిషాణాల నిశ్శబ్ద ఛేదన
అక్షరాలకు రహస్య రాగాలు నేర్పడం

జన జీవన గంగలో తలక్రిందులుగా దూకిన వాడు,
తనను తాను ఉత్తరీయంగా ధరించిన తథాగతుడు,
అంతరంగ తరంగిణీ తీర యాత్రికుడు
అందరూ ప్రవాసులే

బతుకుపోరులో
లోపలా బయటా
నిరంతరం ప్రవాసాలను మార్చుకొంటూ
ప్రవాసం నుంచి ప్రవాసానికి సుదీర్ఘయాత్ర

సంగ్రామ జీవితంలో
జీవన సమరంలో
ప్రవాసం ఆంతరంగిక నిబద్ధత
ప్రవాసం ఒక ప్రచ్ఛన్న వ్యూహం

'సూర్య' దినపత్రిక 'అక్షరం' - 8-9-2008.

దారి తప్పాలి

ప్రతి దారీ తొలి ప్రయాణికుల అడుగుజాడ
దారి-రెండు కొసలలోను చీలిన
ఒక మహావృక్షం లేదా జీవనది

అలసిన వారు దారులను దూషిస్తారు
గమ్యాలను ద్వేషిస్తారు
నడకే నరకమైన వాడికి
ప్రతి అడుగూ మహాయాత్ర

తన నీడలోనే తలదాచుకుంటూ
నడిచే వాడి ప్రయాణం
ఆరంభబిందువు దగ్గరే ముగుస్తుంది

దారి తప్పిన వాడు
కొత్తదారులు కనుగొంటాడు
కొత్తఖండాలకు చేరుకుంటాడు
అన్ని భయాల మూలాలను దర్శిస్తాడు

అనూహ్య స్వర్గాలకు చేరవచ్చు
అవాంఛిత నరకాలను చవిచూడవచ్చు
తెలిసిన దారిలో పయనించే వాడు కూడ
అప్పుడప్పుడయినా దారితప్పకపోతే
ఆ నడక
జీవచ్ఛవ వ్యాయామం

తప్పుతున్న దారులను
మారుతున్న గమ్యాలను
గమనించే ప్రతిబాటసారి సకాల విజేత

కావాలని దారితప్పే వారిని
ఏ దారీ మన్నించదేమో?
నీ సరికొత్త మిత్రులను, శత్రువులను కనుగొనడానికి
మరపు నీడలలో మరుగున చేరిన
ఆ బాల్య మిత్రులను ఆలింగనం చేసుకోడానికి

తప్పిపోయిన నిన్ను నీవు కనుగొనడానికి
నీకే తెలియని నీ విభిన్న అవతారాలను దర్శించడానికి
నీ మనఃగహనాంతరాలలో
అప్పుడప్పుడైనా దారితప్పాలి.

అప్పుడప్పుడు
దారులు కూడా తమ మార్గాలు మరచిపోతాయేమో!
దారి కూడా తన దారి తప్పుతున్నప్పుడు
ప్రతి బాటసారీ
తెలిసో తెలియకో తప్పకుండా దారితప్పాలి.

తోలు బొమ్మ

బతుకు చెప్పే పాఠాలు వినీవినీ విసుగొచ్చి
అతడేదో చెప్పాలనుకుంటాడు

అతడి మనసు అతడి మాట వినదు
బుద్ధి అతడి మాట వినదు
బతుకు అతడి మాట వినదు
అతడి కలలూ అతడిని ధిక్కరిస్తాయి

చెప్పడం తప్ప వినే అలవాటు ఎవరికీ లేదు
మౌనంగా ఉండాల్సిన చోట మనస్సు పట్టు తప్పి
మాట్లాడాల్సిన చోట గొంతు పెగలక
అంతా ఒక అదృశ్య హింసా విధ్వంసం

ఉరితాళ్ళు అయిన సవాలక్ష విధి నిషేధాల కొరడాల మధ్య
అతడి మాటా, మనసూ ఊపిరొదిలాయి

అతడి బుద్ధి ఇప్పుడు గుర్రం లేని రౌతు, అవసరానికి బానిస
తన బానిసత్వాన్ని గుర్తించని బానిస చేతిలో
తనువు ఒక తోలు బొమ్మ.

బధిరుల సంభాషణ

పంచప్రాణాల లోకమూ
లోకానికి పంచ ప్రాణాలూ
అతనికి గడ్డిపరక

తాను పారేసుకున్నలోకాన్నీ
తనను జారవిడుచుకున్న లోకాన్నీ,
అన్వేషిస్తుంటాడు.

లోకానికి కనిపించనివీ
లోకం చూడదలచుకోనివీ
అతనికి ప్రత్యక్షమవుతుంటాయి.
లోకం లాగా వెంట వెంటనే
భాషనూ వేషాన్నీ మార్చుకోలేడు

తమ వికృత ప్రతిబింబాన్ని ఎవరు చూడాలనుకుంటారు?
ఎక్స్‌రేను పటం కట్టి ఎవరు అలంకరించుకొంటారు?

ఎవరినో వెక్కిరిస్తున్నట్లు
అతడు చెత్తకుండీని మోసుకు తిరుగుతుంటాడు.
పాదాలతోనో చేతులతోనో
అతడు ఏవేవో తవ్వుతుంటాడు
తన అంతరాత్మ సమాధులను పెకలిస్తున్నట్లు
లోకం అతడిని తరిమి కొడుతుంది.

నటించీ నటించీ విసుగెత్తి
అభినయశక్తి కోల్పోయినవాడు
అతని బతుకు విఫల అధిక్షేప నాటకం
అతడు ఉన్మాద జీవనశునక దంష్ట్రా పీడితుడు.

జవాబులు లేని ప్రశ్నల బాణాలను
తన హృదయానికే సంధించుకుంటుంటాడు-
లోకంతో సంభాషణ నిష్ప్రయోజనమని గ్రహించిన
ఆత్మ సంభాషణ.

తనకు, అంతరంగానికి, లోకానికి
ఎప్పటికీ పొత్తుకుదరదని తేల్చుకున్న
అతని బతుకు
ముగ్గురు బధిరుల మధ్య సంభాషణ
అతనికి లోకం ఇచ్చిన బిరుదు 'ఉన్మాది'.

ఒకానొక కప్ప

రాత్రి పది గంటలు-
ఇంటిముందు కుర్చీలో కూర్చుని
అలవోకగా పరిసరాలను పరిశీలిస్తుంటే-
చర్మ భాండంలాంటి ఉదరంతో పెద్ద కప్ప
చూపులు తప్ప నోరులేనట్లు
ఒకేసారి కుడి ఎడమలా పరికిస్తూ-
అడుగడుగుకూ మధ్య అది సజీవ శిల్పం
రెప్పపాటులో నోరుతెరిచి మూసేస్తుంది
సమీపంలో ఎగురుతున్న రెక్కల పురుగును
దాని నాలుకగాలమై లాగేసింది.

సుదూరాన పరుగెత్తుతూ ఒక గండు చీమ-
అడుగడుగునా ఆగి ఆగి వ్యూహాలు పన్నే కప్ప
వేగంగా రెండు గెంతులు వేసి ఆగింది
మరు క్షణం చీమ అదృశ్యం.
గోడమీది కీటకాన్ని అందుకోడానికి
అనేక పర్యాయాలు ఎగిరిన కప్ప, దారి మార్చుకుంది...
గోడమీద నాచు మరక...

తన ప్రతి అడుగునూ రహస్య జైత్ర యాత్రగా భావించే కప్ప
రాత్రి ఎవరి పాదాలకింద నలిగిందో
మరుసటి ఉదయం నా దారిలో
పేగులు బయటపడిన కప్ప మృతదేహం.

ముగింపు ఒక దీపస్తంభం

ఆరంభం సంరంభమూ, సంభ్రమాత్మకమూ కావచ్చు!
అనామక అంకురమూ కావచ్చు!
తడిసిన మట్టిగోడలో నుంచి
హరిత నేత్రాలతో తొంగి చూస్తున్న పేరు తెలియని మొక్కలూ,
ప్రవాహంలో క్రిమికీటకాల బుడగలూ
ఎన్ని పుట్టడం లేదు?

పుట్టకముందే గిట్టడంకంటే పుట్టడం విజయమే!
కాని ఆరంభం కంటే ముగింపే ముఖ్యం!

వాక్యానికి ఆరోగ్యాన్ని, జీవకాంతినిచ్చేది
క్రియాసౌష్ఠవమే, అంతిమ పద విన్యాసమే!
శిలను ఉలి తొలుత ఎక్కడ చుంబిస్తేనేమి?
శేషించిన శిల్పం ముఖ్యం.
ఉలి చరిత్రనూ, ఉలిని కదిలించిన
హృదయాంగుళుల మనశ్చిత్రాలను ఆవిష్కరించేది
శేషశిల్ప సౌందర్యమే!
సరాగాలైనా, సమరనాదాలైనా ఎక్కడ చిగురిస్తేనేమి?

పర్యవసానం ప్రధానం.
బిందువు బిందువుతో కరచాలనం చేసి
సింధువును చేరినప్పుడే
నాసికాత్ర్యంబకాలూ, నందికొండలూ శోధింపబడతాయి.

ముగింపు సార్థకమైనప్పుడు
వక్రగతులన్నీ సుందర మందాకిని మలుపులే!
అంతర్లయతో అలరించే అర్ధ వృత్తాలే!
మజిలీలన్నీ సమరవ్యూహ విరామాలే!
గాయాలన్నీ నెలవంకలే!

ఏ సుడిగాలికో ఎగిరి హరివిల్లును తలపించే నెమలిపింఛం,
మిణుగురుల తలపాగాచుట్టుకొన్న నిరాధార పదచిత్రం.
ఊహల ఊరేగింపులో తప్పిపోయిన పద్యశిశువు;
శుష్కపత్ర పతాకం!

ఆరంభ అవస్థలూ, అవసాన ప్రయాసలూలేని
తటిల్లతా విలాసం.
అపజయం ఒక అనాథ.
మరో ఆలోచనా వృక్షధారకు బీజ బిందువైనప్పుడు,
ఏ సాలెగూటి మంచుతెరలకో
వాడి మయూఖ మంత్రదండమైనప్పుడు,
ప్రతిముగింపూ మరో ఆరంభానికి అంకురార్పణమే.

జీవన పద్యానికైనా, ఉద్యమ కావ్యానికైనా
ముగింపు ఒక సమున్నత దీపస్తంభం.

ఆంధ్రజ్యోతి-'వివిధ' - 31-12-2007

పెన్నా ఇతర రచనలు

కవిత్వం

1. నిశ్శబ్దం నామాతృక (1987)
2. అలల పడవల మీద (1990)
3. రహస్య ద్వారం (హైకూ-1991)
4. జీవనది (కావ్యం-1995)
5. చినుకుల చిత్రాలు (హైకూ-2000)
6. సల్లాపం (గజళ్ళు 2003)
7. సులోచనాలు (హైకూ 2004)

సాహిత్య విమర్శ

8. శేషేంద్ర కవిత్వానుశీలనం (1993)
9. శివారెడ్డి కవిత్వం-పరిణామ వికాసాలు (2001)
10. ఎరుక (సాహిత్య వ్యాసాలు 2005)
11. సి.నా.రె. విశ్వంభరలో అర్థయుక్తి (2008)

ఇతర రచనలు

12. రోజు రోజుకో చరిత్ర ('విశాలాంధ్ర' ప్రచురణ-2005)
13. జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు ("నవోదయ బుక్ హౌస్" ప్రచురణ-2006)
14. నిరాశావాది నిఘంటువు (స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ-2006)
15. ప్రేమ 101 కవితలు (సహ సంపాదకత్వం-2007)
16. "కవిత్వదశాబ్ది" 1991-2000 (సహ సంపాదకత్వం-2008)

అచ్చులో : గజల్ సౌందర్య దర్శనం, పెన్నా సాహిత్య వ్యాసాలు